www.prajanaava.in

Telugu Daily

ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు: 08 వెల : రూ.5.00

ప్రజానావ పాఠక మహాశయులకు విజ్ఞప్తి

తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి! వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

☎ : 99484 33277 / 7288825681

published from : Karimnagar, circulated to : Hyderabad, Karim nagar, Warangal, Khammam, Nalgonda, Mahabub nagar | హైదరాబాద్ | సంపుటి : 2 | సంచిక : 173 | మంగళవారం | 03.12.2024

పది నెలల్లోనే అద్భుతాలు జరుగుతాయా?

మా తలరాతలు మార్చిన మీరే ఈ ప్రభుత్వాన్ని కూడా కాపాడుకోవాలి

ప్రభుత్వంపై జరుగుతోన్న విష ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలి

తెలంగాణ సమాజమే మా కుటుంబం

మోడీ నల్లచట్టాలు తెస్తే.. కేసీఆర్ వరి వేస్తే ఉరి అన్నాడు

వారే ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉంది

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పది నెలలే అవుతోందని, ఈ పది నెలల్లోనే అద్భుతాలు జరుగుతాయా? అయినా ఈ కాలంలో మనం చేయాల్సింది చేశామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై జరుగుతోన్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మీరు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మీదే అన్నారు. ఈ ప్రభుత్వం కష్టం మీద వచ్చిందని చెప్పడం లేదని, కానీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయించడం ద్వారా మా తలరాతను మార్చి పెద్ద బాధ్యతలు ఇచ్చారని, కాబట్టి విషప్రచారాన్ని కూడా తిప్పికొట్టే బాధ్యత మీదే అన్నారు. నల్లచట్టాలు తెచ్చిన మోడీ, వరి వేస్తే ఉరి అన్న కేసీఆర్ ఇప్పుడు రైతుల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

మిగతా 2లో..

ప్రతిపక్షంలో రజినీ.. ఇప్పుడు గజినీ

సీఎం రేవంత్‌రెడ్డి అపరిచితుడు

ఆయన నిజస్వరూపం బయటపడుతోంది

డబుల్ స్టాండర్డ్‌లో రేవంత్ పీహెచ్‌డీ చేశారు

రైతుబంధుని ఎగ్గొట్టి..

ఇప్పుడు కేసీఆర్ మీద నెడుతున్నాడు

రైతుబంధు, రైతు బీమా

రూ.80 వేల కోట్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌ది

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో

సీఎం రేవంత్ రెడ్డి నిజస్వరూపం బయటపడుతోందని.. ఆయన డబుల్ స్టాండర్డ్ నిన్న ఒక్క మాట నేడు ఒక్క మాట రేపు ఒక్క మాట మాట్లాడుతాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. రెండు నాలుకుల మనుషులు ఉంటారని.. వారి గురించి పెద్దగా పట్టించుకోరని, కానీ చాలా ప్రమాదకరమన్నారు. డబుల్ స్టాండర్డ్‌లో రేవంత్ రెడ్డి పీహెచ్‌డీ చేశారని.. మూడో స్టాండర్డ్‌ని చెప్పగల నేర్పరి అని ఎద్దేవా చేశారు. ఒక్క పార్టీలో ఉంటూ మరో పార్టీ నాయకురాలను బలిదేవత అంటాడు..

మిగతా 2లో..

అక్కను నరికి చంపిన తమ్ముడు

నెలక్రితమే ప్రేమ వివాహం చేసుకున్న కానిస్టేబుల్ నాగమణి

చూసి తట్టుకోలేక కారుతో ఢీకొట్టి.. వేట కొడవలితో దాడి చేసి హతమార్చిన సోదరుడు

రంగారెడ్డి జిల్లా రాయపోల్‌లో ఘటన

ప్రజానావ, రంగారెడ్డి బ్యూరో

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలో మహిళా కానిస్టేబుల్ నాగమణి హత్యకు గురయ్యారు. రాయపోలు నుంచి ఎండ్లగూడ వెళ్లే రహదారిపై ఈ ఘటన చోటు చేసుకుంది. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. నాగమణి హయత్‌నగర్ పోలీసు

మిగతా 2లో..

రేవంత్.. మీ గురువులకే కేసీఆర్ చుక్కలు చూపించారు

- కేసీఆర్‌ను మొక్క అని వ్యాఖ్యానించడం హాస్యాస్పదం
- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఓ వేగుచుక్క
- ఆయన పాలనలో నిధులు వరదలై పారేవి
- ఇప్పుడు రాష్ట్రంలో తిట్లు పారుతున్నాయి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

02

'సుప్రీం' ఆదేశాలతోనే ఎస్సీ వర్గీకరణ

రూ.2700 కోట్లను రైతు రుణమాఫీకి ఇచ్చాం

రూ.850 కోట్లు రైతుల మీద వడ్డీ భారం పడింది

బీఆర్ఎస్ ఔటర్ రింగ్ రోడ్డు అమ్మి రూ.1700 కోట్లు సొమ్ము చేసుకుంది

పదేళ్లలో బీఆర్ఎస్ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదు

మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

02

మావోయిస్టుల మృతదేహాలను భద్రపరచండి

- కుటుంబ సభ్యులు, బంధువులకు చూపించండి
- పోలీసులకు హైకోర్టు ఆదేశాలు
- ఏటూరునాగారం ఘటనపై హైకోర్టు ఆదేశాలు
- పౌరహక్కుల సంఘం పిటిషన్‌పై విచారణ వాయిదా

02

నన్ను కాల్చి చంపినా.. పేదల పక్షానే మాట్లాడుతా

సీఎం తన సైకో రౌడీ కుట్రలను బంద్ చేయాలి

గురుకులాల్లో టాయిలెట్లు బాగా లేవు..

కుళ్లిన కూరగాయలతో భోజనం పెడుతున్నారు

విద్యార్థులకు మంచి టీచర్లను పెట్టకుంటే ఎలా?

బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ప్రజానావ, హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై ఎన్ని కేసులు పెట్టినా.. చివరకు తనను కాల్చి చంపినా కూడా పేదల పక్షానే మాట్లాడుతానని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

మిగతా 2లో..

ఆరోపణలు అవాస్తవం

పోలీసులపై ఫైరింగ్ వల్లే ఎన్‌కౌంటర్

విష ప్రయోగం చేశారనేది తప్పుడు ప్రచారం

మావోయిస్టుల మృతిపై డీజీపీ జితేందర్

కూరగాయల వ్యాపారులపైకి దూసుకెళ్లిన లారీ

చేవెళ్ల మండలం ఆలూరు స్టేజీ వద్ద ఘటన

నలుగురి మృతి, 20 మందికి పైగా గాయాలు

మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం

02

నన్ను కాల్చి చంపినా.. పేదల పక్షానే మాట్లాడుతా

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. సీఎం తన సైకో రౌడీ కుట్రలను బండ్ చేసి పరిపాలనపై దృష్టి సారించాలన్నారు. బీఆర్ఎస్ గురుకుల బాట కార్యక్రమం నేపథ్యంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఆయన తీవ్రంగా స్పందించారు. గురుకులాల్లో టాయిలెట్లు బాగా లేవని, కుళ్లిన కూరగాయలతో పిల్లలకు భోజనం పెడుతున్నారని, యూనిఫామ్స్ లేకుండా, బెడ్లు, బూట్లు లేకుండా విద్యార్థులు ఎలా చదువుకోగలరని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే తమ బంగ్లాల నుంచి బయటకు వచ్చి గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి చూడాలన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులను పరీక్షల ద్వారా ఎంపిక చేసి... వారికి సరైన ఉపాధ్యాయులను ఇవ్వకుంటే ఎలా? అన్నారు. ఇంగ్లీష్‌మీడియం స్కూళ్ళలో కూడా పిల్లలు ఇంగ్లీష్ మాట్లాడలేని పరిస్థితి ఉందని విమర్శించారు. తనను ఏం చేసినా తాను మాత్రం నోరు లేని పేద బిడ్డల పక్షాన నిలబడతానన్నారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన స్క్రిప్ట్ ప్రకారం మతిస్థిమితం లేని మంత్రులు, ఎమ్మెల్యేలు, మరెందరో చిల్లరమూకలు తనపై దాడి చేస్తున్నారని, కానీ తాను బెదిరే వ్యక్తిని కాదన్నారు. పోలీసులతో అడ్డుకున్నంత మాత్రాన తమ గురుకుల బాట కార్యక్రమం ఆగదన్నారు. గురుకులాల్లోని వాస్తవాలను ఎందుకు దాచి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మావోయిస్టుల మృతదేహాలను భద్రపరచండి

ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో :

ఏటూరునాగారం ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను భద్రపరచాలని తెలంగాణ హైకోర్టు పోలీసులను ఆదేశించింది. మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని పౌరహక్కుల సంఘం తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. భోజనంలో మత్తు పదార్థాలు కలిపి మావోయిస్టులను కస్టడీలోకి తీసుకున్నారని, ఆ తర్వాత చిత్రహింసలకు గురిచేసి కాల్చి చంపారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. మావోయిస్టుల మృతదేహాలపై తీవ్ర గాయాలున్నాయని, కనీసం కుటుంబ సభ్యులకు చూపించకుండా పోస్టుమార్టం కోసం తరలించారని కోర్టుకు వివరించారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ నిబంధనలకు విరుద్ధంగా పోలీసులు వ్యవహరించారన్నారు. అడవిలో పోలీసుల భద్రత దృష్ట్యా మృతదేహాలను వెంటనే ములుగు ఆస్పత్రికి తరలించినట్లు ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు తెలిపారు. కాకతీయ మెడికల్ కళాశాలకు చెందిన వైద్య నిపుణుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించామన్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో తీసినట్లు చెప్పారు. పోస్టుమార్టం ముగిసిన తర్వాత రేపటి వరకు మృతదేహాలను భద్రపర్చాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. మృతదేహాలను కుటుంబ సభ్యులకు, బంధువులకు చూపించాలని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

పదీ నెలల్లోనే అద్భుతాలు జరుగుతాయా?

(మొదటి పేజీ తరువాయి)

213 అంబులెన్స్‌లు ప్రారంభం...

ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆరోగ్య ఉత్సవాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మార్గ్‌లో గల హెచ్ఎండీఏ మైదానంలో ఈ ఉత్సవాలు నిర్వహించారు. ప్రజాపాలన వేడుకల్లో భాగంగా 213 అంబులెన్స్‌లను ప్రారంభించారు. 108, 102 వాహనాలను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత విద్య, వైద్యం అన్నారు. తాము అధికారంలోకి వచ్చాక ఈ రెండింటిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఏడాదిలోపు తమ ప్రభుత్వం వైద్యశాఖలో 14 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందన్నారు. వైద్య శాఖ బలోపేతమైతేనే ఆరోగ్య తెలంగాణ నిర్మాణమవుతుందన్నారు. దేశంలో ఇంత పెద్ద ఎత్తున వైద్య శాఖలో ఎవరూ భర్తీ చేయలేదన్నారు. దేశంలోనే అత్యధిక డాక్టర్లను అందించే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు.

తెలంగాణ సమాజమే మా కుటుంబం

తెలంగాణ సమాజమే తమ కుటుంబం అనుకొని తాము ఉద్యోగాలు ఇచ్చామన్నారు. బీఆర్ఎస్ ఎనిమిది మెడికల్ కాలేజీలను ఇచ్చి కనీస వసతులు కల్పించలేదని విమర్శించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు ఉద్యోగాలు ఊడితేనే యువతకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. పరీక్షలు వాయిదా వేయమని చాలామంది డిమాండ్ చేశారని, కానీ విద్యార్థుల విలువైన సమయం వృథా అవుతుందని అలా చేయలేదన్నారు. కానీ గత ప్రభుత్వం పలుమార్లు వాయిదా వేసిందన్నారు. గత ప్రభుత్వం వరి వేస్తే ఉరి అన్నదని... తాము మాత్రం పంటలు వేసేలా ప్రోత్సహించామన్నారు. సన్నాలకు రూ.500 బోనస్ ప్రకటించామని గుర్తు చేశారు. తాము అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. రైతుల ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు పడుతుంటే కొంతమందికి భయం పట్టుకుందన్నారు. సంక్రాంతికి ముందు గంగిరెద్దుల వాళ్లు వచ్చినట్లు కొంతమంది వస్తారని, కానీ వారు వచ్చేది పంచాయతీ ఎన్నికల కోసమే అన్నారు.

మేం పనిమీద దృష్టి సారించాం

సీఎంగా తన పనిని ఆపి పక్కన పెడితే... అభివృద్ధి ఆగిపోతుందన్నారు. అందుకే తాను పని మీద దృష్టి సారించానన్నారు. మీరు (కార్యకర్తలు, ప్రజలు) భుజాలపై మోస్తేనే తాము అధికారంలో కూర్చున్నామన్నారు. మాకు కుర్చీ రావడానికి కారణం ఈ ప్రజలు, కార్యకర్తలే అన్నారు. కాబట్టి ప్రభుత్వాన్ని కాపాడుకునే బాధ్యత మీదే అన్నారు. అందుకే ప్రతిపక్షం చేసే తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టే బాధ్యత కూడా మీదేనని సభకు వచ్చిన వారిని ఉద్దేశించి అన్నారు.

త్వరలోనే గ్రూప్ 1 ఉద్యోగ నియామక పత్రాలు

త్వరలోనే గ్రూప్ 1 ఉద్యోగాల నియామకపత్రాలు అందజేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ మార్గ్‌లోని హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ఆరోగ్య ఉత్సవాల్లో ఆయన ప్రసంగించారు. ''563 మంది గ్రూప్ 1 అధికారులను తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములను చేయబోతున్నాం. చిన్న ఆరోపణ లేకుండా టీజీపీఎస్సీ పని చేస్తోంది. దీన్ని రాజకీయ పునరావాసంగా మార్చదల్చుకోలేదు. అందుకే సీనియర్ ఐఏఎస్ బుర్రా వెంకటేశంను టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించాం'' అన్నారు.

విద్య, వైద్యానికే మా ప్రాధాన్యం

'ఏడాదిలోనే 14వేల మందిని వైద్య ఆరోగ్యశాఖలో నియమించడం ఒక చరిత్ర. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎనిమిది వైద్య కళాశాలలలు ఇచ్చి ఎలాంటి వసతులూ కల్పించలేదు. దేశంలోనే అత్యధిక డాక్టర్లను అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. గత పదేళ్ల పాలనను మీరు ప్రత్యక్షంగా చూశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత విద్య, వైద్యం. 6500 మందిని వైద్యారోగ్యశాఖలో నియమించాలని నిర్ణయించాం. బీఆర్ఎస్ పాలనలో బీఆర్ఎస్ పాలనలో ఉద్యోగ నియామకాల్లేవు. ఉద్యోగ పరీక్షలు నిర్వహించినా.. పేపర్ లీక్‌ను అరికట్టలేకపోయారు' అని సీఎం విమర్శించారు.

ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఉద్యోగాలిచ్చాం

'కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఉద్యోగాలు ఊడితేనే.. యువతకు ఉద్యోగాలు వచ్చాయి. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 50వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చాం. కాంగ్రెస్ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇస్తే.. పరీక్షలు షెడ్యూల్ ప్రకారం జరుగుతాయని యువత నమ్ముతోంది. పరీక్షలు వాయిదా వేస్తూ పోతే.. మీ విలువైన యుక్త వయసు వృథా అవుతుంది. మన భవిష్యత్తు 21 నుంచి 35 ఏళ్ల లోపు మీరు చేసే పనులే నిర్ణయిస్తాయి. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన ఉద్యోగాలు ఇచ్చాం.. ఇదీ మా చిత్తశుద్ధి. గతంలో ఆర్ఎంపీ డాక్టర్‌ను, తహసీల్దార్‌ను టీజీపీఎస్సీ సభ్యులుగా నియమించారు. పునరావాస కేంద్రాలుగా పబ్లిక్ సర్వీస్ కమిషన్లను మార్చేశారు. చిన్న ఉద్యోగి పెద్ద పెద్ద ఉద్యోగులను నియమించలేరుగా? పబ్లిక్ సర్వీస్ ఉద్యోగాల గురించి పూర్తి అవగాహన ఉన్న అధికారులే సక్రమంగా పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లాకో మెడికల్ కళాశాల, నియోజకవర్గానికో 100 పడకల ఆస్పత్రి ఇస్తామన్నారు.. ఇవ్వలేదు.

కోకాకోలా ఫ్యాక్టరీ ప్రారంభించిన సీఎం రేవంత్

సిద్దిపేట(తెలంగాణ)లోని బండ తిమ్మాపూర్‌లో 'హిందూస్థాన్ కోకాకోలా బెవరేజెస్' గ్రీన్‌ఫీల్డ్ ఫ్యాక్టరీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖతో పాటు.. హెచ్‌సీసీబీ సీఈఓ జువాన్ పాబ్లో రోడ్రిగ్జ్ మొదలైనవారు పాల్గొన్నారు. 49 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ఫ్యాక్టరీ నిర్మాణానికి మొత్తం రూ.2,091 కోట్లు పెట్టుబడి పెట్టారు. ఇందులో రూ.1,409 కోట్లు ఇప్పటికే ఉపయోగించినట్లు తెలుస్తోంది. ఇది పూర్తయిన తరువాత 410 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఇప్పటికే సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో కూడా ఓ హెచ్‌సీసీబీ కర్మాగారం ఉంది. మొత్తం మీద రాష్ట్రంలో హెచ్‌సీసీబీ తన ఉనికిని వేగంగా విస్తరిస్తోంది. హెచ్‌సీసీబీ ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వ్యాపార వృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి మేము కట్టుబడి ఉన్నాము. ప్రపంచ పారిశ్రామిక పెట్టుబడులకు తెలంగాణ కేంద్రంగా నిలుస్తోందనటానికి హెచ్‌సీసీబీ పెట్టుబడులు ఓ ఉదాహరణ. హెచ్‌సీసీబీని మేము అభినందిస్తున్నాము. తెలంగాణ ఆర్థిక అభివృద్ధికి ఈ సంస్థ దోహదపడమే కాకుండా ఉద్యోగాలను కూడా సృష్టిస్తుందన్నారు. హిందుస్థాన్ కోకా కోలా బెవరేజెస్ సీఈవో జువాన్ పాబ్లో రోడ్రిగ్జ్ పెట్టుబడుల గురించి మాట్లాడుతూ.. కంపెనీ వృద్ధి చెందే ప్రయాణంలో ఇది ఒక ముఖ్యమైన అడుగు. ఫ్యాక్టరీ కార్యకలాపాలకు కావలసిన సహాయ సహకారాలను రాష్ట్ర ప్రభుత్వం అందించిందన్నారు.

అక్కను నరికి చంపిన తమ్ముడు

(మొదటి పేజీ తరువాయి)

స్టేషన్‌లో పని చేస్తున్నారు. గతంలో ఆమెకు వివాహం జరిగింది. పది నెలల క్రితం భర్తతో విడాకులు తీసుకున్నారు. నెల రోజుల క్రితం మరో వ్యక్తిని కులాంతర వివాహం చేసుకున్నారు. ఇది చూసి తట్టుకోలేని ఆమె సోదరుడు.. విధులకు వెళ్తుండగా నాగమణిని కారుతో ఢీకొట్టి వేట కొడవలితో దాడి చేసి హతమార్చాడు. మృతురాలి స్వస్థలం రాయపోలుగా పోలీసులు గుర్తించారు. మహిళా కానిస్టేబుల్ నాగమణి, శ్రీకాంత్ నవంబర్ 1న యాదగిరి గుట్టలో ప్రేమ వివాహం చేసుకున్నారని సీఐ తెలిపారు. వీరిది రాయపోలు కాగా.. వివాహ అనంతరం హయత్‌నగర్‌లో నివాసం ఉంటున్నారని చెప్పారు. ఆదివారం కావడంతో దంపతులు సొంత గ్రామానికి వెళ్లారని తెలిపారు. నాగమణిని వెంటపడి కారుతో ఢీకొట్టి.. కొడవలితో హత్య చేసినట్లు గుర్తించినట్లు చెప్పారు.

8 ఏళ్లుగా ప్రేమించుకుంటున్నాం: నాగమణి భర్త శ్రీకాంత్

8 ఏళ్లుగా నాగమణి, తాను ప్రేమించుకుంటున్నామని ఆమె భర్త శ్రీకాంత్ తెలిపారు. నాగమణి హత్య నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ''నాగమణి కానిస్టేబుల్ అయ్యేందుకు సహకరించా. 2021లో ఆమెకు ఉద్యోగం వచ్చింది. గతనెలలో యాదగిరిగుట్టలో పెళ్లి చేసుకున్నాం. ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేశాం. చంపుతామని ఆమె కుటుంబ సభ్యులు బెదిరించారు. నాగమణిని వాళ్ల తమ్ముడే చంపేశాడు. రాయపోల్ నుంచి బయలుదేరే ముందు ఆమె నాకు ఫోన్ చేసింది. తమ్ముడు దాడి చేస్తున్నాడంటూ కంగారుగా మాట్లాడింది'' అని వివరించారు. మరోవైపు ఇబ్రహీంపట్నం పీఎస్ వద్ద శ్రీకాంత్ కుటుంబసభ్యులు ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు.

కూరగాయల వ్యాపారులపైకి దూసుకెళ్లిన లారీ

ప్రజానావ, చేవెళ్ల :

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు స్టేజి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ బీజాపూర్ రహదారి పక్కన దాదాపు 50 మంది కూరగాయలు విక్రయిస్తుండగా.. వారిపైకి లారీ దూసుకెళ్లింది. ఈ ఘటనలో నలుగురు దుర్మరణం చెందారు. దూసుకొస్తున్న లారీని చూసి అక్కడి జనమంతా భయంతో పరుగులు తీశారు. వ్యాపారులపైకి దూసుకెళ్లిన లారీ చెట్టును ఢీకొట్టి ఆగింది. లారీ డ్రైవర్ క్యాబిన్‌లో ఇరుక్కొని తీవ్రగాయాలు పాలవ్వడంతో అతడిని బయటకు తీసి చికిత్సకోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలిస్తున్నారు. లారీ హైదరాబాద్‌లో అన్‌లోడ్ చేసి తిరిగి వికారాబాద్ వస్తున్న క్రమంలో అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా పేర్కొన్నారు. ఈ ఘటనతో హైదరాబాద్ బీజాపూర్ రహదారిపై భీతావహ వాతావరణం నెలకొంది. లారీ సృష్టించిన బీభత్సంలో మృతులను రాములు (ఆలూరు), ప్రేమ్ (ఆలూరు), సుజాత (ఖానాపూర్)గా గుర్తించారు. ఈ ఘటనలో మరికొందరికి గాయాలైనట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. దాదాపు వంద మీటర్ల దూరం నుంచే లారీ అదుపు తప్పిన విషయాన్ని గమనించిన కూరగాయల వ్యాపారులు పరుగులు పెట్టారు. రంగంలోకి దిగిన పోలీసులు కూలిన చెట్టును జేసీబీతో పక్కకు తొలగించారు. ఘటనా స్థలానికి కి.మీల దూరంలో నిన్న కూడా రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ, కారు ఢీకొని బీడీఎల్ ఉద్యోగి దంపతులు నిన్న దుర్మరణం చెందారు. వరుస ప్రమాదాలతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డును విస్తరించాలని ఏళ్ల తరబడి కోరుతున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనతో మృతుల బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి...

రంగారెడ్డి జిల్లాలో లారీ బీభత్సం సృష్టించిన ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

ప్రతిపక్షంలో రజినీ.. ఇప్పుడు గజినీ

(మొదటి పేజీ తరువాయి)

తరవాత అదే పార్టీలోకి వచ్చి దేవత అంటాడని విమర్శించారు. మూడు పంటలకు రైతు బంధు ఇవ్వాలని గతంలో అడిగి.. ఇప్పుడు మొత్త ఎగ్గొట్టాడని ఫైర్ అయ్యారు. దొంగే దొంగ అన్నట్టు ఉందని.. రైతుబంధుని ఎగ్గొట్టిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు కేసీఆర్ మీద నెడుతున్నాడని అన్నారు. 'నిజమైన రైతుబంధు కేసీఆర్. రైతుబంధు, రైతు బీమా రూ.80 వేల కోట్ల ఇచ్చిన ఘనత కేసీఆర్‌ది. ఆ రోజు కేసీఆర్ గారి ప్రభుత్వం ఏ పేద బిడ్డ దసరా పండగ పూట పాత చీర కట్టుకోవద్దని.. చేనేతలకు ఉపాధి కలిపించినట్లు ఉంటుందని చీరలు ఇచ్చేవారు. పండుగ పూట ఆడ పిల్లలను మోసం చేశారు. రేవంత్ రెడ్డి ఈ రోజు ప్రారంభించే కోకో కోల్ కంపెనీ కూడా కాళశ్వరంలో భాగమే. సోనియా గాంధీని బలి దేవత అన్నాడు. మూడు రంగుల పార్టీలోకి వచ్చిన తరవాత దేవత అంటున్నాడు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ మారిన ఎమ్మెల్యేలను రాళ్లతో కొట్టి చంపండి అన్నాడు. ఇప్పుడు ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నాడు. శిలాఫలకలపై ఫోటోలు పెట్టుకుంటున్నాడు రేవంత్ రెడ్డి. ఎక్కడ చూసినా నిర్బంధాలు.. లగచర్లను టెర్రరిస్ట్‌లాగా చేసినావు. సంధ్య గారు వెళితే అక్కడ వారిని అరెస్ట్ చేశావు. ప్రశ్నస్తే దాడులు, ప్రజాస్వామ్య ఖునీ చేస్తున్నాడు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నక్సలైట్స్ ఉంటే బాగుండు అన్నాడు. ఇప్పుడు ఎన్‌కౌంటర్లు చేస్తున్నాడు. ఇది మూడో ఎన్‌కౌంటర్. లెఫ్ట్ పార్టీ వాళ్లు వెళితే ఫార్మా నోటిఫికేషన్ రద్దు చేయాలని వెళితే ఎవరు చెప్పారు అని అన్నాడు. ఇప్పుడు ఫార్మా నోటిఫికేషన్ రద్దు చేశాడు. రేవంత్ రెడ్డి అపరిచితుడు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రజినీ.. ఇప్పుడు గజినీ అన్నట్లు ఉంది వ్యవహారం. మోసం చేయడం మాకు అలవాటు.. మోసపోవడం ప్రజలకు అలవాటు అన్నాడు. రేవంత్ రెడ్డి మోసాన్ని ప్రజలకు చూపించాలనేది నా ప్రయత్నం. ప్రజలు చాలా కోల్పోయారు.' అని హరీశ్‌రావు అన్నారు.

రేవంత్.. మీ గురువులకే కేసీఆర్ చుక్కలు చూపించారు

ప్రజానావ, కోరుట్ల :

తెలంగాణలో బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తే ఊరుకునేది లేదంటూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మొక్క అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం హాస్యాస్పదం అంటూ కామెంట్స్ చేశారు. కోరుట్ల నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో ఎమ్మెల్సీ కవిత సోమవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టి వేధిస్తే ఊరుకునేది లేదు. ముఖ్యమంత్రి, మంత్రులు అదే పనిగా తిట్ల పరిపాలన చేస్తున్నారు. కేసీఆర్ మొక్క అని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం హాస్యాస్పదం. కేసీఆర్ ఒక వేగుచుక్క. రేవంత్ రెడ్డి గురువులకే చుక్కలు చూపించి తెలంగాణ సాధించిన శక్తి కేసీఆర్. గత కేసీఆర్ పాలనలో నిధులు వరదలై పారేవి.. ఇప్పుడు రాష్ట్రంలో తిట్లు పారుతున్నాయి. బ్రిటీష్ పాలనలో కూడా లేని చేనేతపై లేని పన్నులు.. ప్రధాని మోదీ ప్రభుత్వంలో మాత్రం జీఎస్టీ రూపంలో విధించడం మన దౌర్భాగ్యం. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రభుత్వం తరపున చేనేతపై జీఎస్టీని రీయింబర్స్ చేస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. కానీ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక హామీని విస్మరించడం శోచనీయం. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చేనేతపై కేంద్రం విధిస్తున్న జీఎస్టీని రియింబర్స్ చేయాలని డిమాండ్ చేశారు.

ఆరోపణలు అవాస్తవం

ప్రజానావ, హైదరాబాద్ బ్యూరో :

ములుగు జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో పౌరహక్కుల సంఘం ఆరోపణలను తెలంగాణ డీజీపీ జితేందర్ రెడ్డి ఖండించారు. ఎదురుకాల్పుల్లో విష ప్రయోగం చేశారనేది తప్పుడు ప్రచారం అంటూ కొట్టిపారేశారు. ములుగు జిల్లాలో జరిగిన ఎదురు కాల్పుల ఘటనపై తెలంగాణ డీజీపీ జితేందర్ రెడ్డి స్పందించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. 'ఎదురుకాల్పుల్లో విష ప్రయోగం చేశారనేది దుష్ప్రచారం. పౌరహక్కుల సంఘం ఆరోపణలను ఖండిస్తున్నాను. ఎదురుకాల్పులకు కొద్ది రోజుల ముందు ఇన్‌ఫార్మర్ అనే నెపంతో ఇద్దరు ఆదివాసీలను దారుణంగా హత్య చేశారు. ఇలాంటి ఘటనలను అడ్డుకొనేందుకు పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులపై మావోయిస్టులు కాల్పులకు దిగారు. మావోయిస్టులు అత్యాధునిక ఆయుధాలు వినియోగించారు. పోలీసులతో జరిగిన ఎదురు కాల్పుల్లో సాయుధులైన ఏడుగురు మావోయిస్టులు మృతిచెందారు. శవపరీక్షలు.. హైకోర్టు, ఎన్‌హెచ్‌ఆర్‌సీ సూచనల మేరకే జరుగుతున్నాయి. విచారణ అధికారిగా ఇతర జిల్లా డీఎస్పీని నియమించాము. దర్యాప్తు కొనసాగుతోంది అని చెప్పుకొచ్చారు. ఇదిలా ఉండగా.. ఆదివారం తెల్లవారుజామున ములుగు జిల్లా ఏటూరునాగారంలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఓ మహిళా మావో సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో నర్సంపేటఇల్లందు ఏరియా కమిటీ కార్యదర్శి కుర్సం మంగు అలియాస్ భద్రు, ఏటూరునాగారంమహాదేవ్‌పూర్ డివిజన్ కమిటీ కార్యదర్శి ఈగోలపు మల్లయ్య అలియాస్ మధు సైతం ఉన్నారు. మధు స్వస్థలం పెద్దపల్లి జిల్లా రాణాపూర్ కాగా, మిగతా ఆరుగురు ఛత్తీస్‌గఢ్ జిల్లాకు చెందినవారు. ఉదయం 6.16 గంటల ప్రాంతంలో చెల్పాకఐలాపూర్ అభయారణ్యంలోని పోలకమ్మవాగు సమీపంలో మావోయిస్టులకు, బలగాలకు మధ్య కాల్పులు జరిగాయి. దాదాపు అరగంటకుపైగా కాల్పులు జరిగినట్లుగా పోలీసులు పేర్కొన్నారు. ఆ తర్వాత సంఘటనా స్థలంలో ఏడుగురి మృతదేహాలను గుర్తించారు. ఘటనాస్థలిలో రెండు ఏకే47 తుపాకులు, 303 రైఫిల్, ఇన్సాస్ తుపాకీ, ఎస్‌బీబీఎల్ గన్, సింగిల్‌షాట్ తుపాకీ, తపంచా, కిట్‌బ్యాగులు, విప్లవ సాహిత్యం తదితర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

'సుప్రీం' ఆదేశాలతోనే ఎస్సీ వర్గీకరణ

ప్రజానావ, సూర్యాపేట :

సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు కోర్డు ఆదేశాలతో ఎస్సీ వర్గీకరణను ముందుకు తీసుకెళ్తున్నామని ఆయన తెలిపారు. 2700 కోట్లతో రైతు రుణమాఫీకి ఇవ్వడం జరిగిందని, 850కోట్లు రైతుల మీద వడ్డీ భారం పడిందన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. బీఆర్ఎస్ ఔటర్ రింగ్ రోడ్డు అమ్మేసి 1700 కోట్లు సొమ్ము చేసుకుందని, పదేళ్లలో బీఆర్ఎస్ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని ఆయన వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి కాకముందే 50 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని ఆయన ఉద్ఘాటించారు. 40 లక్షల మంది రైతులు 153 లక్ష మెట్రిక్ టన్ను పంట పండించారని, పొల్యూషన్ నివారణకు ఎలక్ట్రికల్ బస్సు కొనుగోలు చేసిందన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తున్నామని, అత్యధిక పరిశ్రమలు నిర్మిస్తున్నామని, ఈనెల నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభిస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

వాజేడు ఎస్ఐ సూసైడ్

సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య
గోదావరి సమీపంలోని ఫెరియాడో రిసార్ట్‌లో ఘటన

ప్రజానావ, ములుగు బ్యూరో :

ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న రుద్రారపు హరీశ్ (29) సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గోదావరి సమీపంలోని ఫెరియాడో రిసార్ట్ గదిలో సోమవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న వెంటాపురం సీఐ కుమార్ ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ములుగు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీశ్ రిసార్ట్‌కు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. మృతుడి స్వస్థలం జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం వెంకటేశ్వర్లపల్లి. వ్యక్తిగత కారణాలతో హరీశ్ ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.

వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం చేరేనా..!

ప్రజానావ, గోదావరిఖని:

సింగరేణిలో వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యం చేరేందుకు ఇంకా నాలుగు నెలల సమయం ఉంది. ఈ నేపథ్యంలో ఉత్పత్తి వేగవంతం చేసేందుకు మరింత కసరత్తు చేయాల్సి ఉంది. గనుల్లో పని స్థలాలు గుర్తించాలి. బొగ్గు పొరలను వెలికి తీసేందుకు నిరంతర పర్యవేక్షణ వేగం చేయాలి. 202425 ఆర్థిక సంవత్సరానికి 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా సింగరేణి నిర్దేశించుకుంది. ప్రస్తుతం ఎనిమిది నెలలు గడచిపోయాయి. మిగిలిన నాలుగు నెలల్లో సాధించాల్సిన ఉత్పత్తిపై దృష్టి సారించాల్సి ఉంది. కార్మికులకు నాలుగు నెలల పాటు నగదు ప్రోత్సాహక పథకాన్ని అమలు చేయాలి. ఈ విషయమై ఇప్పటి వరకు యాజమాన్యం ఎలాంటి ప్రకటన చేయలేదు. నవంబరు నాటికి సింగరేణి 40 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే సాధించింది. మిగిలిన కాలంలో 32 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధిస్తేనే వార్షిక లక్ష్యం చేరుకునే అవకాశం ఉంది. నవంబరు నెలలో 99 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించగా గడచిన ఏడు నెలల్లో తక్కువ శాతం ఉత్పత్తి సాధించడంతో వార్షిక లక్ష్యానికి దూరంగా ఉంది.

నెలకు 8 మిలియన్ టన్నులు...

రానున్న రోజుల్లో నెలకు 8 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధిస్తేనే వార్షిక లక్ష్యానికి చేరుకునే అవకాశం ఉంది. ఇప్పటి వరకు నెలకు 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తూ వస్తున్న సింగరేణి రానున్న కాలంలో 8 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు కేవలం అయిదు ఏరియాల్లో మాత్రమే వందశాతం బొగ్గు ఉత్పత్తి సాధించాయి. గత అక్టోబరులో 72 శాతం, అక్టోబరులో 91 శాతం, నవంబరులో 99 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించింది. ఇందులో కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు ప్రాంతాలు మాత్రమే వంద శాతానికి మించి ఉత్పత్తి చేశాయి.

అందుబాటులోకి రాని కొత్త గనులు

సింగరేణి వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకోవడానికి కొత్త గనులు అందుబాటులోకి రాలేదు. ఈ ఏడాది ప్రణాళికలో ఉన్న నైనీ బొగ్గుబ్లాకుతో పాటు కొత్తగూడెం వీకే ఓసీపీ, ఇల్లెందు ప్రాంతంలోని రొంపేడు ఓసీపీ, రామగుండం మెగా ఓసీపీలు అందుబాటులోకి రాలేదు. ఈ కారణంగా వార్షిక బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం కనిపించే అవకాశం ఉంది.

ప్రోత్సాహక పథకంపై ఆశలు

సింగరేణి సంస్థ ప్రతి సంవత్సరం కార్మికులకు ఆర్థిక సంవత్సరంలో చివరి నాలుగు మాసాలు ప్రోత్సాహక పథకాలను ప్రవేశపెడుతుంది. డిసెంబరు, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో హాజరుతో పాటు ఉత్పత్తి ఆధారంగా కార్మికులకు నగదు ప్రోత్సాహకాన్ని అందిస్తుంది. నాలుగు నెలల్లో గైర్హాజరు లేకుండా పనిచేసిన కార్మికులకు ప్రత్యేక ప్రోత్సాహకం, వ్యక్తిగతంగా, సామూహికంగా బొగ్గు ఉత్పత్తి సాధనలో అందించిన సహకారం. వంద శాతం ఉత్పత్తి సాధించేందుకు ఉద్యోగుల పని విధానం లాంటి అంశాలను పరిగణలోకి తీసుకుని వారికి ప్రోత్సాహక పథకాన్ని అమలు చేస్తుంది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇటీవల గుర్తింపు సంఘంతో నిర్వహించిన నిర్మాణాత్మక సమావేశంలో ఈ విషయాన్ని నాయకులు ప్రస్తావించారు. గనులు, డివిజన్ల వారిగా ప్రోత్సాహక పథకాన్ని పరిగణలోకి తీసుకుని లక్ష్యాన్ని అధిగమించిన ఉద్యోగులకు వారి పని విధానం ఆధారంగా ప్రోత్సాహకాన్ని పంపిణీ చేస్తారు.

డబుల్ బెడ్ రూమ్ డ్రాలో రానివారికి ఇందిరమ్మ ఇండ్ల పథకంలో

మొదటి ప్రాధ్యాన్యత ఇవ్వాలి

- సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజానావ, సిరిసిల్ల:

డబుల్ బెడ్ రూమ్ డ్రాలో ఇండ్లు రానివారికి ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముషం రమేశ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోడం రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ డ్రాలో రాని వారిని మొదటి ప్రాధాన్యతగా గుర్తించి నివేశస్థలంతో పాటు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షలు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. వారంతా ఎన్నో ఏళ్లుగా ఇల్లు లేక కిరాయి ఉంటూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ వచ్చినంక సొంత ఇల్లు వస్తుందని ఆత్మగౌరవంతో బతకవచ్చనే ఆశతో ఎదురుచూసిన వారి ఆశలు అడిఆశలయ్యాయని, గత ప్రభుత్వంలో అనేక సర్వేలు నిర్వహించి ఎంపిక చేసి అందరికీ సరిపోయే ఇండ్లు నిర్మించకుండా డ్రా ద్వారా ఎంపిక చేయడం చేసి వీరికి అన్యాయం చేసిందన్నారు. అప్పుడు అధికారులు సరైన సర్వే నిర్వహించకపోవడంతో చాలామంది అనర్హులకు డబుల్ బెడ్ రూమ్ రావడం జరిగిందని, దీంతో అసలైన నిరుపేదలకు అన్యాయం జరిగిందన్నారు. గతంలో అనర్హులకు కేటాయించిన డబల్ బెడ్ రూమ్‌ల ఎంపికపై దర్యాప్తు చేయించి, వాటిని అర్హులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శ వర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, సీపీఎం సిరిసిల్ల పట్టణ కార్యదర్శి అన్నల్ దాస్ గణేశ్, జిల్లా కమిటీ సభ్యులు సూరం పద్మ, బెజిగం సురేశ్, మోర తిరుపతి, నల్ల బాలు, దాసరి రూప, గట్ల స్వప్న, బోనాల లక్ష్మితో పాటు 150 మంది డబల్ బెడ్ రూమ్ రాని లబ్ధిదారులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందించేందుకే గ్రీవెన్స్ డే

ప్రజానావ, సిరిసిల్ల:

బాధితులకు సత్వర న్యాయం చేసేందుకే గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. సోమవారం గ్రీవెన్స్ డేలో భాగంగా బాధితుల నుంచి 18 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భూ తగాదాలు, ఆస్తి తగాదాల విషయంలో చట్ట ప్రకారం, నిబంధనలకు అనుగుణంగా నడుచుకుంటూ బాధితులకు సత్వర న్యాయం అందించే విధంగా చూడాలని పోలీసులకు సూచించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందిస్తున్నామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే అసాంఘిక శక్తులు, నేర స్థల పట్ల కఠిన వైఖరి అవలంబిస్తూ శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చూస్తామని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

మహిళలు మౌనం వీడి ఫిర్యాదు చేయాలి

మహిళలు తమకు జరిగిన అన్యాయాలపై మౌనం వీడి ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఈ ఏడాదిలో మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని 44 కేసులు నమోదు చేయడం జరిగిందని, 60 మందిపై పెట్టి కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. మరో 110 మంది ఆకతాయిలకు తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఘనంగా ఆరోగ్య ఉత్సవాలు

ప్రజానావ, సిరిసిల్ల:

ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా సోమవారం రాజన్న సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆరోగ్య ఉత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో అలాగే ఆయా జిల్లాల్లో నర్సింగ్ కళాశాలలు, మైత్రి ట్రాన్స్ క్లినిక్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ వసంత రావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, డీ.సీ.హెచ్.ఎస్ పెంచలయ్య, జీజీహెచ్ వైద్యులు సంతోష్ కుమార్.డాక్టర్లు హాజరయ్యారు. వర్చువల్ పద్ధతిలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను, మైత్రి ట్రాన్స్ క్లినిక్ ను మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించగా, స్థానికంగా జ్యోతి ప్రజ్వలన చేసి కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభోత్సవం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలలో 30 డిప్లమా ఇన్ అనస్థీషియా కోర్సులకు 30 డిప్లమా ఇన్ ఈసీజీ కోర్సులకు మొత్తం 60 సీట్లు , 14 వైద్య పోస్టులు మరియు 3 అంబులెన్స్‌లను మంజూరు చేసారు. జిల్లా దవాఖానలో మైత్రి ట్రాన్స్ క్లినిక్ ను ఏర్పాటు చేశారు. దవాఖాన లోని మొదటి అంతస్తులోని 116 రూం నెంబర్ లో ముగ్గురు వైద్యులతో క్లినిక్ సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ అధికారులు, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతలు వెయ్యి ఎకరాలు ఆక్రమించారు

- ఇసుక, ఖనిజ మాఫియా పేరిట దోచుకుతిన్నారు
- అభివృద్ధిని చూసి ఓర్వలేకనే విమర్శలు
- కాంగ్రెస్ ముస్తాబాద్ మండలాధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి

ప్రజానావ, సిరిసిల్ల:

అధికారంలో ఉన్న సమయంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో బీఆర్ఎస్ నేతలు వెయ్యి ఎకరాల భూమిని ఆక్రమించారని, ఇసుక, ఖనిజ మాఫియా పేరిట దొరికినంత దోచుకు తిన్నారని కాంగ్రెస్ ముస్తాబాద్ మండలాధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన స్థానిక నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ నేత బొల్లి రామ్మోహన్ అరెస్టు సందర్భంగా ఆ పార్టీ నేతలు కాంగ్రెస్ సీనియర్ నేత కేకే మహేందర్ రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తూ ఇష్టారీతిన మాట్లాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టం తన పని తాను చేసిందని, అక్రమంగా భూములు అక్రమించడం వల్లే అరెస్టు చేసిందన్నారు. తమ నేత 23 ఏళ్లుగా ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ఇక్కడే ఉన్నారని, గెలిచినా.. ఓడినా నియోజకవర్గాన్ని వదలి వెళ్లలేదన్నారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనను గెలిపిస్తే వారానికి రెండు రోజులు ఇక్కడే ఉంటానని అబద్ధాలు మాటలు చెప్పారన్నారు. ప్రభుత్వం అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కలెక్టర్‌పై కేటీఆర్ వ్యాఖ్యలు సరికావని, వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు, మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీల పరిష్కారంలో జాప్యమొద్దు

రాజన్న సిరిసిల్ల.:

ప్రజావాణికి వచ్చే అర్జీల పరిష్కారంలో జాప్యం చేయవద్దని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్పష్టం చేశారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఆయా శాఖలకు వస్తున్న అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ శాఖకు 34, ఉపాధి కల్పన శాఖకు 3, ఎంపీడీవో తంగళ్ళపల్లికి 8, ఎంపీడీవో ముస్తాబాద్ కు 3, ఎంపీడీవోఎల్లారెడ్డిపేట కు 1, ఎంపీడీవో కోనరావుపేటకు 2, ఎంపీడీవో బోయినపల్లికి 2, సిరిసిల్ల మున్సిపల్ కు 10, డీఎం అండ్ హెచ్ ఓ 5, ఎస్డీసీకి 3, విద్యాశాఖకు 2, డీఆర్డీఓ, డీడబ్ల్యూఓ, మార్కెటింగ్, టౌన్ ప్లానింగ్, ఎస్పీ ఆఫీస్, మైన్స్, పౌర సరఫరాల శాఖ, ఆర్ అండ్ బీ, ఎంబీ ఇంట్రా, సెస్, డీఎస్ సీడీఓ, కార్మిక శాఖ, జిల్లా దవాఖాన సిరిసిల్ల కార్యాలయాల కు ఒకటి చొప్పున వచ్చాయి. ఇక్కడ ఆయా శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు సన్నాహాలు

ప్రజానావ, సిరిసిల్ల :

ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. క్షేత్రస్థాయిలో ఈ పథకం విజయవంతం కావాలంటే జిల్లాలో ప్రత్యేక యంత్రాంగం అవసరం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గతంలో ఈ శాఖలో పని చేసిన 50 మంది సిబ్బంది పలు శాఖలకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. అయితే వీరిలో చాలా మంది ఉద్యోగ విరమణ పొందగా, మరి కొందరు మృతి చెందారు. ప్రస్తుతం ఆయా శాఖల్లో పని చేస్తున్న వారిని మాతృ శాఖలోకి తీసుకునే ప్రక్రియ ఈ నెలాఖరులోపు పూర్తికానుంది. జిల్లాల వారీగా గృహ నిర్మాణశాఖ కార్యాలయాలను ప్రారంభిస్తారు. తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 గృహాలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనిలో ఉమ్మడి జిల్లాకు 45,500 ఇందిరమ్మ గృహాలు రానున్నాయి. సొంత స్థలం ఉన్న వారికి తొలుత ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాకు రూ.2 వేల కోట్ల పైనే నిధులు వచ్చే అవకాశం ఉంది.

అధికారులదే కీలక బాధ్యత

ఈ పథకం అమలుకు జిల్లా స్థాయిలో పీడీలు, ఈఈలు, డీఈలు, అలాగే మండలాల్లో ఏఈలు కీలక బాధ్యత పోషించాల్సి ఉంటుంది. గతంలో మండలాల వారీగా పొరుగుసేవల విభాగంలో వర్క్ ఇన్‌స్పెక్టర్లు కూడా పని చేశారు. ఇప్పటికే సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల్లో నలుగురు డీఈలు, ఏఈలు చేరారు. జగిత్యాల, పెద్దపల్లి నుంచి ఒక్కొక్కరు మాత్రమే వచ్చారు. డిప్యుటేషన్‌లో పని చేస్తున్న హెచ్ఎండీఏ తదితర శాఖల నుంచి రిలీవ్ కావాలి. మరోవైపు వారు గృహ నిర్మాణశాఖలో చేరాల్సిన జిల్లాలను ఎంపిక చేసుకోవాలి. జిల్లా స్థాయిలో ఈఈ, ఇద్దరు డీఈలు, ఏఈలు ఉంటారు. ప్రతి జిల్లాకు హౌసింగ్ అధికారి, మేనేజర్, కంప్యూటర్ ఆపరేటర్, అకౌంటెంట్‌లను నియమిస్తారు. ఇలా డివిజన్‌లు, నియోజకవర్గాల వారీగా ఇంజినీర్లు, కార్యాలయ సిబ్బందిని కేటాయిస్తారు.

తప్పిదాలు పునరావృతం కాకూడదని...

గతంలో ఇందిరమ్మ గృహాల మంజూరు, నిర్మాణం, నిధుల విడుదలలో అవకతవకలు జరిగాయి. ఉమ్మడి జిల్లాలో రూ.17.50 కోట్ల మేరకు దుర్వినియోగమైనట్లు అప్పట్లో ప్రత్యేక విచారణ బృందం నివేదికలో వెల్లడైంది. తర్వాత దీనిపై ఎలాంటి కదలికలేదు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపికలో అవకతవకలకు అవకాశం లేకుండా ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించారు. దీనిని ప్రభుత్వం ఈ వారంలో లాంఛనంగా ప్రారంభించనుంది. ఇప్పటికే ఈ యాప్‌తో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రజాపాలన దరఖాస్తుల ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని గృహ నిర్మాణ శాఖను ప్రభుత్వం బలోపేతం చేస్తుంది.

చొప్పదండిలో అసంపూర్తిగా నిర్మాణం

చొప్పదండి: చొప్పదండిలోని పాత వెదురుగట్ట రోడ్‌లోని రెండు పడక గదుల పరిస్థితి ఇది. ఏడేళ్ల కిందట 93 ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయగా 50 ఇళ్లకు స్లాబుతోపాటు గోడలు పూర్తి చేశారు. మరో 43 ఇళ్లకు మూడు అంతస్తులో నిర్మాణం చేసినా.. పూర్తి స్థాయిలో గోడలు నిర్మించలేదు. అయిదేళ్ల నుంచి పనుల్లో అడుగు పడటంలేదు. నిధులు రాకపోవడంతో గుత్తేదారు వదిలేశారు. చొప్పదండి వాసులకు సొంతింటి కల నెరవేరకుండా పోయింది.

రెండేళ్లుగా బిల్లుల పెండింగ్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వంలోని రెండు పడక గదుల నిర్మాణాలు అసంపూర్తి దశలో ఉన్నాయి. 2021 లోపు నిర్మాణం జరిగినవే చాలా వరకు పూర్తయ్యాయి. వాటినే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కొన్ని చోట్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకే పరిమితమైంది. అసంపూర్తి పనులను పూర్తి చేసేందుకు 2023 వరకు పలుమార్లు టెండర్లు పిలిచినా గుత్తేదారులు ముందుకు రాలేదు. మరోవైపు పనులు చేసిన గుత్తేదారులకు సైతం రెండేళ్లుగా బిల్లులు రావడం లేదు. ఇలా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలకు రూ.25 కోట్ల వరకు పెండింగ్ బిల్లులు ఉన్నట్లు సమాచారం.

వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. సోమవారం స్వామివారిని 38.459మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. కోడెమొక్కులు చెల్లించిన అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.

- ప్రజానావ, వేములవాడ

యాసంగి సాగుకు జాగ్రత్తలు తప్పనిసరి

వ్యవసాయ క్షేత్రస్థాయి అధికారి సంతోష్ కుమార్

ప్రజానావ, దౌల్తాబాద్:

అన్నదాతలు యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్న వేళ వ్యవసాయ క్షేత్రస్థాయి సంతోష్ కుమార్ కీలక సూచనలు చేస్తున్నారు. నారుమడిపై చలి ప్రభావం పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. యాజమాన్య పద్ధతుల ద్వారా వరి నారును తెగుళ్ల నుంచి కాపాడుకోవాలని ఊరూరా అవగాహన కల్పిస్తున్నారు. వరిని చలి నుంచి రక్షించుకోవడం, మందుల పిచికారీ తదితరాలపై అధికారులు చెబుతున్న సూచనలు, సలహాలు మీ కోసం. వానకాలం పంట కోతలు పూర్తయిన వెంటనే రైతులు యాసంగి పంటకు దుక్కులు దున్ని నారుమడులు సిద్ధం చేసుకుంటుంటారు. నారు పోసుకునే ముందు ఆ మడికి సరిపడా సుమారు రెండు క్వింటాళ్లు బాగా మాగిన పశు వులు లేదా కోళ్ల ఎరువుతోపాటు కిలో వరకు జింక్ సల్ఫేట్ వేసుకోవాలి. మడులపై చలి ప్రభావం పడ కుండా ప్రత్యేక యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు పొందే అవకాశం ఉంటుంది. యాసంగిలో రైతులు ఎక్కువగా దొడ్డు రకం వరి సాగుకు మొగ్గు చూపుతుంటారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని స్వల్పకాలిక రకాలైన సన్నాలు సాగు చేయాలి. స్వల్పకాలిక రకాలైన (120-190రోజుల పంట కాలం) కూనారం సన్నాలు (కేఏ న్ఎం118), జగిత్యాల రైన్1(జేజీఎల్ 24423), వంటి రకాలు వేసుకోవాలి. రైతులకు నవంబరు 15 నుంచి డిసెంబర్ 20 మధ్యలో నారు పోసుకుంటే మేలుగా ఉండడంతోపాటు చలి ఉధృతిని బట్టి పంట కాలం 10 నుంచి 15 రోజులకు పెరిగే అవకాశం ఉంటుంది. నారుమడిలో మండె కట్టిన విత్తనాలను వేయడం తప్పనిసరిగా అల వాటు చేసుకుంటే బాగుంటుంది. భాస్వరాన్ని రెట్టింపు మెతాదులో వేసుకొని రాత్రిపూట నారుమడిలో నీళ్లు లేకుంటే చలి ప్రభావం మొక్కలపై తగ్గుతుంది కాబట్టి ప్రతిరోజూ ఉదయం, సగటిపూట వెచ్చని నీటిని పెట్టి సాయంత్రం తీసివేయాలి. చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు నారుమడి చుట్టూ ఒక అడుగు ఎత్తులో పలుచని పాలిథిన్ షీట్ లేదా ఖాళీ ఎరువుల సంచులతో కుట్టిన పట్టాలను సాయంత్రం వేలలో కప్పి ఉదయం పూటతీసివేయాలి. నీరు పెట్టటానికి, తీయటానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసి ఎత్తు నారుమళ్ళను తయారు చేస్తే మంచిది. 2 గుంటల (ఐదు సెంట్లు) నారుమడికి 2 కిలోల నత్రజని (1కిలో విత్తనం చల్లేముందు, మరో కిలో విత్తిన 12-14 రోజులకు), 1 కిలో భాస్వరం మరియు 1 కిలో పొటాష్ నిచ్చే ఎరువులను దుక్కిలో వేసుకోవాలిపశువుల పేడను లేదా సేంద్రియ ఎరువులను దుక్కిలో వేయడం చాలా మంచిది. మొలక కట్టిన విత్తనాన్ని చల్లి, మొదట్లో (7 రోజులు) ఆరు తడులు ఇచ్చి, ఆ తర్వాత మొక్క దశలో పలుచగా (23 సెం.మీ.,) నీరు ఉంచాలి. జింకు లోపం కు లీటరు నీటికి 2గ్రా., జింకు సల్ఫేటు కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలి. మెట్టనారుమడిలో ఇనుప ధాతు లోపాన్ని గుర్తిస్తే సరి చేయాలి. మొక్క వయసు మరియు ఎదుగుదలను బట్టి 2 నుండి 5గ్రా.' అన్నభేది +0.5 - 1 గ్రా. నిమ్మ ఉప్పు లీటరు నీటికి కలిపి పిచికారి చెయ్యాలి .నారు పీకే వారం రోజుల ముందు గుంట నారుమడికి (2.5 సెంట్లకు) 400గ్రా., కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఇసుకలో కలిపి చల్లి పలుచగా నీరుంచాలి. అవసరాన్ని బట్టి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నాట్లు ఆలస్యమయ్యే ప్రదేశాల్లో రెండవ సారి నత్రజనిని ఆలస్యంగా వేసి నారు ముదరకుండా చూడాలి. ఈ పరిస్థితులలో తామర పురుగులను నివారించాలి. నారుమడిలో కలుపు నివారణకు బ్యూటాక్లోర్ లేదా ప్రెటిలాక్లోర్ 25 మి.లీ. ఎకరాకు సరిపడా నారుమడికి 5 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 810 రోజులకు పిచికారి చెయ్యాలి. బిస్పైరిబాక్ సోడియం కలుపు మందును 0.5 మి.లీ., ఒక లీటరు నీటికి చొప్పున కలిపి విత్తిన 8 -10 రోజులకు పిచికారి చెయ్యాలి.

యోగాతోనే పరిపూర్ణ ఆరోగ్యం

ప్రజానావ, ఎల్లారెడ్డిపేట:

మనిషిని పరిపూర్ణ ఆరోగ్యవంతుడిగా చేయడంలో యోగా ఎంతో ఉపయోగపడుతుందని యోగా శిక్షకుడు ఎలిగేటి కృష్ణ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో పతాంజలి యోగా సమితి తపోవన యోగా కేంద్రం సహకారంతో సోమవారం ఉచిత యోగాపై కృష్ణ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి పరిపూర్ణ ఆరోగ్యవంతంగా ఉండాలంటే యోగా తప్పనిసరి చేయాలన్నారు. భారతీయులు పూర్వ కాలం నుంచి మనకు అందించిన అద్భుతమైన సంపద యోగా అన్నారు. ప్రపంచానికి యోగం నేర్పింది భారతీయులేనని, మనిషిని పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే ప్రధాన క్రియల్లో యోగ ఒకటని చెప్పారు. మనిషిలోని ఆందోళన తగ్గించడంతో పాటు జీర్ణ వ్యవస్థ, హృదయ స్పందన, నాడీ వ్యవస్థను చురుగ్గా ఉంచేందుకు యోగా దోహదపడుతుందన్నారు. నిత్యం యోగా చేస్తే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొక్కల ప్రేమికుడు దుంపెన రమేశ్, సీనియర్ జర్నలిస్ట్ బండారి బాల్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ నీవూరి వెంకట నరసింహారెడ్డి, రైతు సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గుండాడి వెంకటరెడ్డి, ఆర్ఎంపీ వైద్యులు రమేశ్, లైన్స్ క్లబ్ ప్రతినిధి లక్ష్మణ్, సానా రవీందర్, శ్రీనివాస్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

బైకును ఢీకొని లాక్కెళ్లిన టిప్పర్

ప్రజానావ, తూప్రాన్:

ద్విచక్ర వాహనంపై నుంచి టిప్పర్ వెళ్లడంతో మంటలు చెలరేగి వాహనదారుడు తీవ్రంగా గాయపడిన సంఘటన తూప్రాన్‌లో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ.శివానందం తెలిపిన వివరాలు.. తూప్రాన్ పట్టణానికి చెందిన చాకలి దశరథ(50) పరిశ్రమలో పని చేయడంతో పాటు ఇస్త్రీ చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం పరిశ్రమకు వెళ్లి ద్విచక్రవాహనంపై తూప్రాన్ వైపు తిరిగి వస్తున్నాడు. నర్సాపూర్ చౌరస్తా వద్ద డస్ట్ లోడుతో వెళ్తున్న టిప్పర్.. ద్విచక్రవాహనాన్ని ఢీకొని కొంత దూరం లాక్కెళ్లింది. రాపిడితో మంటలు చెలరేగి ద్విచక్రవాహనం పూర్తిగా కాలిపోగా.. దశరథ రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. మంటల్లో చిక్కుకున్న అతడిని స్థానికులు కాపాడి.. 108 వాహనంలో తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఎస్ఐ.శివానందం సిబ్బందితో వచ్చి ద్విచక్రవాహనం మంటలను ఆర్పివేశారు. టిప్పర్ డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సంఘటన స్థలంలో తీవ్రగాయాలతో దశరథ కన్నీరుమున్నీరుగా విలపించారు. తన కొడుకులకు ఫోన్ చేసి ప్రమాద విషయాన్ని తెలియజేశాడు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు.

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ను విమర్శిస్తే

సహించేది లేదు

ప్రజానావ, చిన్న శంకరంపేట:

మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనాంపల్లి రోహిత్ తన సొంత డబ్బులు వెచ్చించి నియోజకవర్గం లో అనేక సేవా కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఎంఎస్ఎస్ఓ ద్వారా పేదవారికి ఎన్నో రకాల సేవలు అందించి తల్లి తండ్రి లేని పిల్లలకి పోస్ట్ ఆఫీస్ లో డబ్బులు జమ చేసి బాండ్లు అందించిన ఘనత మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కుటుంబానిది. ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టని బిజెపి నాయకులు మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ను విమర్శించే స్థాయి కాదన్నారు. చిన్న శంకరంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సానా సత్యనారాయణ మాజీ సర్పంచ్ రాజిరెడ్డిలు అన్నారు. మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సానా సత్యనారాయణ, మాజీ సర్పంచ్ రాజు రెడ్డి లు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక సంవత్సరం లోపే ఆర్ గ్యారంటీలు అమలు చేయడం జరిగిందని వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నప్పుడే రైతులకు ఏకకాలంలో రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రైతులకు రుణమాఫీ చేయడం జరిగిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చడం జరుగుతుందన్నారు. సొంత డబ్బులు పెట్టి నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుస్తూ సేవా కార్యక్రమాలు చేస్తున్న కుటుంబం ఏదైనా ఉందా అంటే కేవలం మైనంపల్లి కుటుంబమేనని పేర్కొన్నారు. ఒక రూపాయి కూడా ఖర్చు పెట్టి పేదవారికి అండగా నిలబడని బిజెపి నాయకులు మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని వారు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చడం జరుగుతుందని, ఆరు గ్యారంటీలు కూడా అమలు చేయడం జరిగిందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జంగా రాయి సొసైటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సాన సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పోతరాజు మనోజ్ కుమార్, చిన్న శంకరండ మాజీ సర్పంచ్ రాజ్ రెడ్డి, చిన్న శంకరంపేట మాజీ ఉపసర్పంచ్ చిరంజీవి,ఎస్సీ సెల్ జిల్లా నాయకులు రామచంద్రం, రమేష్‌గౌడ్, రాజాసింగ్, రాజ్ కుమార్ గౌడ్, అక్బర్, నాయకులు, నేతలు తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య కట్టడి.. కాగితాలకే పరిమితమా?

ప్రజానావ, జిన్నారం:

కాలుష్యం.. ఎంత చేటు చేస్తుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దీని నివారణకు ప్రత్యేక యంత్రాంగాన్ని కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) పేరిట ఏర్పాటుచేసినా.. ఆశించిన ఫలితాలు మాత్రం దక్కని పరిస్థితి. ఇటీవల రాష్ట్ర హైకోర్టు పీసీబీ తీరును తప్పుపట్టడంతో పాటు మంత్రి కొండా సురేఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి 72 పేజీల లేఖ రాయడం ఇందుకు నిదర్శనం. ఫిర్యాదు వచ్చినప్పుడు మాత్రమే అధికారులు స్పందిస్తున్నారే తప్ప ఆ తర్వాత చర్యలు శూన్యం. పారిశ్రామిక ప్రాంతాల్లో వాయు, జల కాలుష్యంతో జనం బెంబేలెత్తుతున్నారు. నేడు జాతీయ కాలుష్య నివారణ దినాన్ని పురస్కరించుకొని 'న్యూస్‌టుడే' కథనం. ఉమ్మడి మెదక్ జిల్లాలో పటాన్‌చెరు, జిన్నారం, హత్నూర, మనోహరాబాద్, చిన్నశంకరపేట, చేగుంట, వికారాబాద్ జిల్లాలో తాండూరు ప్రాంతాల్లో పరిశ్రమలు విస్తరించాయి. ప్రధానంగా జిన్నారం, హత్నూర, మనోహరాబాద్ మండలాల్లో కాలుష్య సమస్య వేధిస్తోంది. పరిశ్రమ నెలకొల్పే సమయంలో సంబంధిత యూనిట్ తన ఉత్పత్తులు, వచ్చే కాలుష్యం, దాని కట్టడికి పాటించే పద్ధతులను డీపీఆర్‌లో స్పష్టంగా పేర్కొనాల్సి ఉంటుంది. ఇదంతా అనుమతి వరకే పరిమితమవుతోంది. ఆ తర్వాత యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయన్న ఆరోపణలు లేకపోలేదు.

ఐడీఏ బొల్లారంలో ఇలా..

ఇష్టానుసారంగా..

జల కాలుష్య నివారణకు స్వీయ నియంత్రణ పద్ధతులు అవలంబించి జీరో డిశ్చార్జి విధానం అమలు చేయాలి. వ్యర్థాలను శుద్ధి చేసి తిరిగి వినియోగించేలా యూనిట్‌లోనే ఈటీపీలు ఏర్పాటు చేసుకోవాలి. శాస్త్రీయ పద్ధతులు అవలంబించాలి. ఒక వేళ సొంతంగా సదరు వ్యవస్థ లేకుంటే జీడిమెట్ల, పటాన్‌చెరులోని ఈటీపీలకు జల వ్యర్థాలను, దుండిగల్ శివారులోని రాంకీ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టుకు ఘన వ్యర్థాలను తరలించాలి. కొన్ని కర్మాగారాలు మాత్రమే ఇలా తరలిస్తుండగా, మిగతావి నిబంధనలను పాటించడం లేదు. వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయడం, రసాయనాలను ట్యాంకర్లలో తీసుకెళ్లి నాలాలు, చెరువులు, కుంటల్లో పారబోస్తున్నారు. జిన్నారం, ఐడీఏ బొల్లారంలో ఈ సమస్య ఎక్కువగా ఉంది. గుమ్మడిదల, హత్నూర, మనోహరాబాద్ మండలాల్లోని పరిశ్రమలతో వాయు కాలుష్యం పెరుగుతోంది. ఊపిరి పీల్చుకోని దయనీయ పరిస్థితి.

ఎక్కడెక్కడంటే..

ఇటీవల ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలోని రెండు పరిశ్రమల వల్ల ఇక్కడి మల్లన్న బస్తీవాసులు పడుతున్న ఇబ్బందులు అంతాఇంతా కాదు. రసాయనాల విడుదలతో జనాన్ని ఊపిరి పీల్చుకోనివ్వలేదు. గడ్డపోతారం, ఖాజీపల్లి, కిష్టాయపల్లి, బొంతపల్లి, పాశమైలారం, ఇస్నాపూర్, గుండ్లమాచునూర్, కాళ్లకల్ తదితర ప్రాంతాల్లో ఈ సమస్య వేధిస్తోంది.

చర్యలు తీసుకుంటూనే ఉన్నాం

కాలుష్య కారకుల విషయంలో ఎప్పుడూ ఉదాసీనంగా వ్యవహరించలేదు. నిరంతర నిఘాతో జరిమానాలు, బ్యాంకు గ్యారెంటీల జప్తు వంటి చర్యలు తీసుకుంటున్నాం. అనేక యూనిట్లు మూసివేశాం. కాలుష్య కట్టడికి తమ శాఖ అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నాం.

బోడుప్పల్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

ప్రజానావ, మేడిపల్లి:

ప్రభుత్వ స్థలం కనిపిస్తే కబ్జాదారులు రెచ్చిపోయి కబ్జాలకు పాల్పడుతున్నారని,భూములకు ధరలు పెరగడంతో అక్రమదారుల చూపు ప్రభుత్వ భూముల వైపు కబ్జాదారుల చూపు మళ్లింది. తప్పుడు పత్రాలతో ప్రభుత్వ భూమిని కొల్లగొట్టడానికి కొందరు దళారులు చూస్తున్నారని పలుమార్లు హెచ్చరించినా వినకపోవడంతో అక్రమ నిర్మాణాలపై కొరడా ఝుళిపించామని మేడిపల్లి తహసీల్దార్ హసీనా ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మేడిపల్లి మండల పరిధిలోని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ సర్వే నెంబర్ 63/1 నుండి 63/25 లో ఎస్సీల కోసం కొరకు కేటాయించిన ప్రభుత్వ స్థలంలో కొందరు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారని సమాచారం రావడంతో మేడిపల్లి తహసీల్దారు ఆదేశాల మేరకు రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ రాకేష్ పర్యవేక్షణలో రెవెన్యూ,మున్సిపల్ సిబ్బంది ఇండ్లు,2బిస్మెంట్లు అక్రమ నిర్మాణాలను జేసీబీ సహాయంతో కూల్చివేశారు. నిర్మాణ దారులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. గతంలో కూల్చివేతలు చేయడానికి రెవిన్యూ సిబ్బంది వస్తే కబ్జాదారులు రెచ్చిపొయి దాడులకు దిగుతున్నారని,కొందరూ రాష్ట్ర నాయకుల పేరును వాడుతూ కూల్చివేతలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది వ్యక్తులు ఇష్టానుసారంగా ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని కబ్జాదారులు ఎంతటివారైనా వదిలి పెట్టేది లేదని,యదేచ్ఛగా ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. దళారులను నమ్మి ప్రభుత్వ భూముల్లో స్థలాలు కొనవద్దని తెలిపారు. కూల్చివేత లో రెవిన్యూ సిబ్బంది కుమార్ పాల్గొన్నారు.

బంగారం ధరలు భగభగలే

ముంబయి: బంగారం ధర ఇప్పుడే చుక్కలను అంటుతోంది. గత ఏడాది కాలంలోనే అనూహ్యంగా పెరిగి మధ్యతరగతి వారికీ అందుబాటులో లేని స్థాయికి చేరింది. బంగారం ధర పెరగడం ఇక్కడితో ఆగదని, వచ్చే ఏడాది ఇంకా పెరిగే అవకాశం ఉందని అంతర్జాతీయ కన్సల్టెన్సీ, పెట్టుబడుల సేవల సంస్థ అయిన గోల్డ్‌మ్యాన్ శాక్స్ అంచనా వేసింది. వచ్చే ఏడాది చివరి నాటికి ఔన్సు (31.10 గ్రాములు) బంగారం ధర 3,150 డాలర్లకు (1 డాలర్= రూ.84.44) చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది. అంటే గ్రాము మేలిమి (24 క్యారెట్ల) బంగారం ధర మన రూపాయల్లో రూ.8,553 కావచ్చు. ప్రస్తుతం ఔన్సు బంగారం అంతర్జాతీయ మార్కెట్లో 2,6502,700 డాలర్ల స్థాయిలో కదలాడుతోంది. శనివారం చూస్తే హైదరాబాద్ బులియన్ విపణిలో 24 క్యారెట్ల పసిడి ధర గ్రాము రూ.7,900 వద్ద ఉంది. స్వల్పమధ్యకాలంలో మేలిమి బంగారం గ్రాము ధర రూ.7,500కు చేరొచ్చని విక్రేతలు అంచనా వేస్తున్నా, దీర్ఘకాలంలో మాత్రం ధరలు పెరుగుతాయనే చెబుతున్నారు. వివిధ దేశాల మధ్య ఉద్రిక్తతలు, యుద్ధాలు పసిడి గిరాకీకి ప్రధాన కారణం కాగా, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, కొన్ని దేశాల కేంద్ర బ్యాంకులు బంగారం నిల్వలు పెంచుకోవడమూ ధర పెరిగేందుకు దోహద పడుతున్నాయని ఈ సంస్థ విశ్లేషించింది.

నవంబరులో పెరిగిన వాహన విక్రయాలు

ముంబయి: దిగ్గజ వాహన తయారీ సంస్థలు మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, టయోటా తమ దేశీయ ప్రయాణికుల వాహన విక్రయాల్లో వృద్ధిని నమోదు చేశాయి. పెళ్లిళ్ల సీజన్‌తో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్న గిరాకీ, స్పోర్ట్స్ వినియోగ వాహనాల (ఎస్‌యూవీల)కు లభిస్తున్న ఆదరణ విక్రయాలు పెరిగేందుకు దోహదం చేసింది. ఇటీవల స్టాక్ మార్కెట్‌లో నమోదైన హ్యుందాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) దేశీయ విక్రయాలు 2 శాతం తగ్గాయి. మారుతీ సుజుకీ దేశీయంగా నవంబరులో 1,41,312 ప్రయాణికుల వాహనాల టోకు విక్రయాలను నమోదు చేసింది. ఏడాది క్రితం ఇదే నెలలో విక్రయించిన 1,34,158 వాహనాలతో పోలిస్తే ఇవి 5 శాతం ఎక్కువ. మారుతీ మొత్తం పోర్ట్‌ఫోలియోలో ఎస్‌యూవీల వాటా 29 శాతానికి చేరింది. యుటిలిటీ వాహనాలైన బ్రెజా, ఎర్టిగా, గ్రాండ్ విటారా, ఎక్స్ఎల్ 6 వాహనాల విక్రయాలు 49,016 నుంచి 59,003కు చేరాయి. చిన్న కార్ల విభాగంలో ఆల్టో, ఎస్‌ప్రెసోల విక్రయాలు 9,959 నుంచి 9,750కి తగ్గాయి. కాంపాక్ట్ కార్ల విభాగంలో బాలెనో, సెలెరియో, డిజైర్, ఇగ్నిస్, స్విఫ్ట్, టూర్ ఎస్, వ్యాగన్ఆర్‌ల విక్రయాలు 64,679 నుంచి 61,373కు పరిమితమయ్యాయి.

నష్టాల నుంచి లాభాల్లోకి.. మళ్లీ 80వేల ఎగువకు సెన్సెక్స్

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి నెమ్మదించడంతో.. దాని ప్రభావం ఆరంభంలో సూచీలపై పడింది. దీంతో నష్టాల్లో ప్రారంభమైన మార్కెట్ సూచీలు.. మధ్యాహ్నం తర్వాత రాణించాయి. ముఖ్యంగా రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్ షేర్లు సూచీలను ముందుకు నడిపించాయి. దీంతో సెన్సెక్స్ మళ్లీ 80 వేల ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఉదయం 79,743.87 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 79,802.79) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైంది. కాసేటికే మరింత నష్టాల్లోకి జారుకుని 79,308 వద్ద కనిష్ఠాన్ని తాకింది. ఆ తర్వాత కోలుకుని లాభాల్లోకి వచ్చిన సూచీ.. చివరికి 445.29 పాయింట్ల లాభంతో 80,248.08 వద్ద ముగిసింది. నిఫ్టీ 144.95 పాయింట్ల లాభంతో 24,276.05 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 11 పైసలు క్షీణించి 84.71 వద్ద ముగిసింది. సిమెంట్ ధరలు పెరిగే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో సెన్సెక్స్ 30 సూచీలో అల్ట్రాటెక్ సిమెంట్ (3.93 శాతం) ప్రధానంగా లాభపడింది. ఆ పై జేఎస్‌డబ్ల్యూ స్టీల్, అదానీ పోర్ట్స్, టెక్ మహీంద్రా, టైటాన్ షేర్లు లాభపడ్డాయి. ఎన్టీపీసీ, హిందుస్థాన్ యూనిలీవర్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్ఇండ్ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 72.68 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2659 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

ఆరంభంలోనే 'బేర్'మంటున్న మార్కెట్లు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం నష్టాలతో ప్రారంభమయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై సెప్టెంబరులో దేశ జీడీపీ వృద్ధి రేటు రెండేళ్ల కనిష్ఠమైన 5.4 శాతానికి చేరింది. ఇది మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపించింది. అటు ఈ వారంలో వెలువడబోయే ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్ష సమావేశ నిర్ణయాలపై దృష్టిపెట్టిన మదుపర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. దీంతో నేటి ట్రేడింగ్ ఆరంభంలోనే సూచీలు నష్టాల్లో జారుకున్నాయి. సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా కుంగిపోగా.. నిఫ్టీ 24,100 మార్క్ దిగువకు పడిపోయింది. ఉదయం 9.30 గంటల సమయంలో సెన్సెక్స్ 346 పాయింట్ల నష్టంతో 79,456 వద్ద, నిఫ్టీ 70 పాయింట్లు దిగజారి 24,053 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ జీవనకాల కనిష్ఠ స్థాయి నుంచి కాస్త కోలుకుంది. ఈ ఉదయం 2 పైసలు బలపడి 84.58గా కొనసాగుతోంది. నిఫ్టీలో మారుతి సుజుకీ, శ్రీరామ్ ఫైనాన్స్, అపోలో హాస్పిటల్స్, కోల్ ఇండియా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ షేర్లు రాణిస్తున్నాయి. బ్రిటానియా, హిందుస్థాన్ యునిలివర్, ఓఎన్జీసీ, ఎల్ అండ్ టీ, టీసీఎస్ షేర్లు ఒత్తిడికి గురవుతున్నాయి. నేడు ఆసియాపసిఫిక్ మార్కెట్లు ఫ్లాట్‌గా సాగుతున్నాయి.

ఒకేరోజు 3,200 స్టోర్లు.. ఓలా ఎలక్ట్రిక్ సీఈవో ప్రకటన

న్యూఢిల్లీ: ప్రముఖ విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ తన రిటైల్ స్టోర్లను అమాంతం పెంచేందుకు సిద్ధమైంది. దేశవ్యాప్తంగా ఈ నెలాఖరుకల్లా 4 వేల స్టోర్లను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఇందులోభాగంగా ప్రస్తుతం ఉన్న 800 స్టోర్ల సంఖ్యను 4 వేలకు పెంచనున్నట్లు ఓలా ఎలక్ట్రిక్ సీఈఓ భవీశ్ అగర్వాల్ తెలిపారు. ఈమేరకు ఎక్స్ వేదికగా సోమవారం ఓ ప్రకటన చేశారు. "విద్యుత్ వాహనాలకు సంబంధించి విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నాం. ప్రస్తుతం ఉన్న 800 ఓలా ఎలక్ట్రిక్ స్టోర్ల సంఖ్యను 4 వేలకు పెంచాలని నిర్ణయించాం. మా వినియోగదారులకు మరింత చేరువకావడమే దీని లక్ష్యం. డిసెంబర్ 20న దేశవ్యాప్తంగా అన్ని స్టోర్లూ ఒకేసారి ప్రారంభించనున్నాం. బహుశా ఈ స్థాయిలో స్టోర్లను ప్రారంభించడం ఇదే తొలిసారి" అని భవీశ్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆయా స్టోర్లలో ఓలా ఎలక్ట్రిక్ సర్వీసులూ లభిస్తాయని పేర్కొన్నారు.

5 స్టార్ క్లబ్‌లోకి హ్యుందాయ్ టక్సన్.. బీఎన్‌క్యాప్ టెస్టులో టాప్ రేటింగ్

విద్యుత్ వాహన విభాగంలో మార్కెట్ లీడర్‌గా ఉన్న ఓలా ఎలక్ట్రిక్‌పై ఇటీవల కాలంలో ఫిర్యాదులు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా విక్రయానంతర సేవల విషయంలో పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాతీయ వినియోగదారులు హెల్ప్‌లైన్‌కు 10వేలకుపైనే ఫిర్యాదులు రావడం, దీనిపై సెంట్రల్ కన్జూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (CCPA) విచారణకు ఆదేశించడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈనేపథ్యంలో కంపెనీ నుంచి ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. ఈ ప్రకటన నేపథ్యంలో కంపెనీ షేర్లు రాణించాయి. ఉదయం నష్టాల్లో ట్రేడవగా.. 1.40 గంటలకు దాదాపు 5 శాతం లాభంతో ఓలా షేర్లు రూ.91.67 వద్ద ట్రేడవుతున్నాయి.

ఆడి కార్ల ధర పెంపు.. ఎప్పటినుంచంటే?

న్యూఢిల్లీ: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల ఉత్పత్తుల సంస్థ ఆడీ మరోసారి తమ వాహనాల ధరలను సవరించనుంది. భారత్‌లో విక్రయిస్తున్న అన్నిరకాల మోడళ్లపై గరిష్ఠంగా 3శాతం ధరలు పెంచనున్నట్లు కంపెనీ సోమవారం వెల్లడించింది. వచ్చే ఏడాది జనవరి నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నట్లు తెలిపింది. రవాణా ఛార్జీలతో పాటు నిర్వహణ వ్యయాలను సర్దుబాటు చేయడం కోసమే ఈ నిర్ణయం తీసుకొన్నట్లు కంపెనీ పేర్కొంది. "కంపెనీ, డీలర్ల స్థిరాభివృద్ధి కోసం ఈ ధరల సవరణ అత్యవసరం. మా విలువైన కస్టమర్లపై ఈ పెంపు భారం తక్కువగా ఉండేలా చూసేందుకు మేం కట్టుబడి ఉన్నాం" అని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ ధిల్లాన్ వెల్లడించారు. ప్రస్తుతం మన దేశంలో ఆడీ A4, A6, Q3, Q5, Q7 తదితర ప్రముఖ మోడళ్లను విక్రయిస్తోంది. కాగా.. ఈ ఏడాది జూన్‌లోనూ కంపెనీ తమ ఉత్పత్తుల ధరలను గరిష్ఠంగా 2శాతం మేర పెంచిన సంగతి తెలిసిందే. మరోవైపు, ఇతర కార్ల విక్రయాల కంపెనీలు కూడా వచ్చే ఏడాది నుంచి తమ ఉత్పత్తుల ధరలను సవరించనున్నట్లు ప్రకటించాయి. జనవరి 1 నుంచి తమ అన్ని మోడళ్ల ధరలను 3శాతం మేర పెంచనున్నట్లు బీఎండబ్ల్యూ వెల్లడించింది. అంతకు ముందే మెర్సిడెస్ బెంజ్ కూడా 3శాతం పెంపును ప్రకటించింది.

విండ్‌ఫాల్ ట్యాక్స్ రద్దు.. రిలయన్స్, ఓఎన్‌జీసీకి భారీ ఊరట

న్యూఢిల్లీ: దేశీయంగా ఉత్పత్తి చేస్తున్న ముడిచమురుపై విధిస్తున్న విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను రద్దు చేస్తూ కేంద్రం కీలక నిర్ణయం తీసుంది. దీనిపై గత కొంతకాలంగా కసరత్తు చేస్తున్న ప్రభుత్వం.. ఎట్టకేలకు తన నిర్ణయాన్ని ప్రకటించింది. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కేంద్రం తాజా నిర్ణయంతో రిలయన్స్, ఓఎన్‌జీసీలకు భారీ ఊరట లభించినట్లయయింది. దీంతో ఆయా కంపెనీల రిఫైనింగ్ మార్జిన్లు పెరగనున్నాయి. పెట్రోల్, డీజిల్, విమాన ఇంధనం (ఏటీఎఫ్), క్రూడ్ ఉత్పత్తుల ఎగుమతులపై 2022 జులై 1 నుంచి కేంద్రం విండ్‌ఫాల్ ట్యాక్స్ విధిస్తోంది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరిగిన నేపథ్యంలో ఆయా కంపెనీలకు పెద్దఎత్తున లాభాలు వస్తుండడంపై విధించే పన్నునే విండ్‌ఫాల్ ట్యాక్స్‌గా పేర్కొంటారు. రెండు వారాల సగటు చమురు ధరల ఆధారంగా ప్రతి 15 రోజులకోసారి ప్రభుత్వం ఈ పన్ను రేట్లను సవరిస్తూ వచ్చింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర గత కొన్ని నెలలుగా 7275 డాలర్ల మధ్య చలిస్తోంది. ఈ నేపథ్యంలో విండ్‌ఫాల్ ట్యాక్స్ రద్దు చేయాలని కేంద్రం నిర్ణయానికొచ్చింది. దీంతో పాటు పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై ప్రభుత్వం విధిస్తున్న రోడ్డు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెస్సును కూడా రద్దు చేసింది. విండ్‌ఫాల్ రద్దు వార్తల నేపథ్యంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 1.30 శాతం లాభంతో రూ.1309 వద్ద ట్రేడవుతోంది.

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.82 లక్షల కోట్లు

ముంబయి: ఈ ఏడాది నవంబరులో స్థూల జీఎస్‌టీ వసూళ్లు రూ.1.82 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. కిందటేడాది నవంబరులో వసూలైన రూ.1.68 లక్షల కోట్లతో పోలిస్తే ఈ మొత్తం 8.5% అధికం. దేశీయ లావాదేవీల నుంచి అధిక ఆదాయాలు రావడం కలిసొచ్చింది. జీఎస్‌టీ అమల్లోకి వచ్చాక, 2024 ఏప్రిల్‌లో వసూలైన రూ.2.10 లక్షల కోట్లు అత్యధికంగా ఉండగా, అక్టోబరు వసూళ్లు రూ.1.87 లక్షల కోట్లు రెండో స్థానంలో నిలిచాయి. నవంబరులో వసూలైన రూ.1.82 లక్షల కోట్ల జీఎస్‌టీలో సీజీఎస్‌టీ రూ.34,141 కోట్లు, ఎస్‌జీఎస్‌టీ రూ.43,047 కోట్లు, ఐజీఎస్‌టీ రూ.91,828 కోట్లు, సెస్సు రూ.13,253 కోట్లుగా ఉన్నాయి. దేశీయ లావాదేవీల ద్వారా జీఎస్‌టీ వసూళ్లు 9.4% పెరిగి రూ.1.40 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

దిగుమతులపై పన్నుల ద్వారా ఆదాయం 6% అధికమై రూ.42,591 కోట్లుగా ఉంది. రిఫండ్‌లు 8.9% పెరిగి రూ.19,259 కోట్లుగా నమోదయ్యాయి. రిఫండ్‌ల సర్దుబాటు అనంతరం, నికర జీఎస్‌టీ వసూళ్లు 11% పెరిగి రూ.1.63 లక్షల కోట్లకు చేరాయి.

ఇళ్ల ధరలు 11% పెరిగాయ్.. ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో అత్యధికం

న్యూఢిల్లీ: దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో ఇళ్ల ధరలు వార్షిక ప్రాతిపదికన సగటున 11 శాతం మేర పెరిగినట్లు ఓ నివేదిక వెల్లడించింది. జులై సెప్టెంబర్ త్రైమాసికంలో (Q3) అత్యధికంగా దిల్లీ రాజధాని ప్రాంతంలో ఈ పెరుగుదల 32 శాతంగా నమోదైంది. ఈమేరకు రియల్ ఎస్టేట్ సంఘం క్రెడాయ్, రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ సంస్థ కొలియర్స్, డేటా అనలిటిక్స్ సంస్థ లియాసెస్ ఫోరాస్ కలిసి క్యూ3కి సంబంధించి 'హౌసింగ్ ప్రైస్ ట్రాకర్ రిపోర్ట్'ను వెలువరించాయి.

దేశంలోని ప్రధాన నగరాలైన అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, దిల్లీ ఎన్‌సీఆర్, హైదరాబాద్, కోల్‌కతా, ముంబయి మెట్రోపాలిటిన్ రీజియన్, పుణె నగరాల్లో ఇళ్ల ధరలను పరిగణనలోకి తీసుకొని ఈ నివేదికను రూపొందించారు. ఆయా నగరాల్లో వార్షిక ప్రాతిపదికన సగటున ఇళ్ల ధరలు 11 శాతం పెరిగాయని, దీంతో చదరపు అడుగు సగటు రూ.11 వేలకు చేరిందని (కార్పెట్ ఏరియాను పరిగణనలోకి తీసుకుని) నివేదిక తెలిపింది. 2021 నుంచి వరుసగా 15వ త్రైమాసికంలోనూ ఈ పెరుగుదల నమోదైందని పేర్కొంది. దిల్లీలో అత్యధికంగా ఈ పెరుగుదల 32 శాతం మేర పెరిగి.. sft సగటు ధర రూ.11,438కి చేరిందని నివేదిక తెలిపింది. బెంగళూరులో ఒక్కో sft రూ.9,471 నుంచి రూ.11,743కు చేరిందని నివేదిక తెలిపింది.

అమ్మకానికి 10 లక్షల ఇళ్లు

దేశవ్యాప్తంగా 8 ప్రధాన నగరాల్లో 10 లక్షల యూనిట్లు విక్రయం కావాల్సి ఉందని నివేదిక తెలిపింది. వార్షిక ప్రతిపదికన ఈ సంఖ్య తగ్గుతూ వస్తోందని పేర్కొంది. అత్యధికంగా ముంబయి మెట్రోపాలిటన్ రీజియన్‌లోనే దాదాపు 40 శాతం ఇళ్లు అమ్ముడవ్వాల్సి ఉన్నాయని నివేదిక పేర్కొంది. హైదరాబాద్‌లో ఈతరహా ఇళ్లు వార్షిక ప్రాతిపదికన 28 శాతం పెరిగినప్పటికీ.. త్రైమాసిక ప్రాతిపదికన తగ్గుముఖం పట్టినట్లు నివేదిక వెల్లడించింది.

ఆసీస్‌ను 3-2తో ఓడించినా డబ్ల్యూటీసీ ఫైనల్‌కు భారత్! సమీకరణాలు ఇలా

అడిలైడ్: మ్యాచ్‌లు ముగుస్తున్నకొద్దీ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (2023-25) ఫైనల్ రేసు రసవత్తరంగా మారుతోంది. టాప్2లో నిలిచి ఫైనల్‌లో ఆడటం కోసం ఐదు జట్లు (భారత్, ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక) పోటీపడుతున్నాయి. ప్రస్తుతం టీమ్‌ఇండియా (61.11) అగ్రస్థానంలో ఉంది. స్వదేశంలో జరుగుతున్న రెండు టెస్టుల సిరీస్ తొలి మ్యాచ్‌లో శ్రీలంకపై 233 తేడాతో విజయం సాధించిన సౌతాఫ్రికా (59.26) రెండో స్థానానికి దూసుకొచ్చింది. దీంతో ఆస్ట్రేలియా (57.69) మూడో స్థానానికి పడిపోయింది. న్యూజిలాండ్ (50.00), శ్రీలంక (50.00) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. మూడు టెస్టుల సిరీస్ తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై ఇంగ్లాండ్ విజయం సాధించడంతో డబ్ల్యూటీసీ ఫైనల్ సమీకరణాలు మారాయి. ప్రస్తుతం టీమ్‌ఇండియా ఫైనల్ కు అర్హత సాధించాలంటే సమీకరణాలు ఇలా ఉన్నాయి.

భారత్ 5-0, 4-1, 4-0, 3-0తో బోర్డర్-గావస్కర్ ట్రోఫీని కైవసం చేసుకుంటే

ప్రస్తుతం జరుగుతున్న బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ ని, ఇతర జట్ల ఫలితాలతో సంబంధం లేకుండా నేరుగా ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు భారత్ జట్టు అర్హత సాధిస్తుంది. పైన పేర్కొన్న సమీకరణాల ప్రకారం భారత్ సిరీస్‌ను కైవసం చేసుకుంటే ఆస్ట్రేలియా ఫైనల్ రేసు నుంచి నిష్క్రమిస్తుంది.

భారత్ 3-1తో గెలిస్తే

ఐదు మ్యాచ్‌ల బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ సిరీస్‌ని భారత్ 3-1తో కైవసం చేసుకున్నా డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరుతుంది. కానీ, సౌతాఫ్రికాతో జరిగే రెండో టెస్టులో శ్రీలంక విజయం సాధిస్తేనే ఇది సాధ్యమవుతుంది. ఒకవేళ సౌతాఫ్రికా, శ్రీలంకల మధ్య రెండో మ్యాచ్ డ్రా అయినా కూడా ఆసీస్‌పై భారత్ 3-1తో గెలిస్తే ఫైనల్‌కు చేరుతుంది.

3-2తో ఆసీస్‌ను ఓడిస్తే

ఆసీస్‌తో ఐదు టెస్టుల సిరీస్‌ను టీమ్‌ఇండియా 3-2తో గెలిచినా డబ్ల్యూటీసీ ఫైనల్‌కు వెళ్లే అర్హత సాధిస్తుంది. కానీ, ఆస్ట్రేలియాతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో శ్రీలంక కచ్చితంగా ఒక మ్యాచ్‌ను డ్రా చేసుకుంటేనే భారత్ ఫైనల్‌కు చేరుతుంది. ఈ సిరీస్ జనవరి 29 నుంచి శ్రీలంక వేదికగా మొదలవనుంది.

2-2తో డ్రా అయినా

బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ సిరీస్ 2-2తో డ్రా అయినా భారత్ ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్ చేరడానికి అవకాశాలుంటాయి. కానీ, ఇలా జరగాలంటే ప్రస్తుతం శ్రీలంకతో జరుగుతున్న సిరీస్‌ను దక్షిణాఫ్రికా 2-0 తేడాతో కైవసం చేసుకోవాలి. అంతేకాకుండా ఆస్ట్రేలియాతో జరిగే 2 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను లంకేయులు కనీసం 1-0తో చేజిక్కించుకోవాలి. అప్పుడే బోర్డర్‌గావస్కర్ ట్రోఫీని భారత్ 2-2తో డ్రా చేసుకున్నా ఫైనల్‌కు చేరుతుంది.

ఓపెనింగ్ జోడీని మార్చొద్దు.. రోహిత్
ఆ స్థానంలో బ్యాటింగ్‌కు రావాలి: మాజీ సెలక్టర్

ముంబై: టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఇప్పుడు ఏ స్థానంలో బ్యాటింగ్‌కు రావాలనేది చర్చనీయాంశంగా మారింది. ఆస్ట్రేలియాతో తొలి టెస్టుకు రోహిత్‌తో పాటు శుభ్‌మన్ అందుబాటులో లేకపోవడంతో కేఎల్ రాహుల్ .. యశస్వి జైస్వాల్ తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించాడు. ఇప్పుడు రోహిత్, శుభ్‌మన్ తిరిగి జట్టులోకి రానుండటంతో జట్టు కూర్పు ఆసక్తికరంగా మారింది. ఆస్ట్రేలియా పీఎం ఎలెవన్‌తో ప్రాక్టీస్ మ్యాచ్‌లోనూ రాహులే ఓపెనింగ్ చేశాడు. రోహిత్ నాలుగో స్థానంలో వచ్చాడు. ఈ నేపథ్యంలో బ్యాటింగ్ ఆర్డర్‌పై మాజీ సెలెక్టర్ దేవాంగ్ గాంధీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇప్పుడున్న ఓపెనింగ్ జోడీని మార్చవద్దని కోరాడు. కేఎల్ రాహుల్, జైస్వాల్ భారత ఇన్నింగ్స్‌ను ఆరంభించాలని.. రోహిత్ ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు రావాలని సూచించాడు. ''ఐదో స్థానంలో రిషభ్ పంత్ బాగా ఆడుతున్నాడు. అందుకే రోహిత్ ఆరో స్థానంలో రావాలి. కుడి, ఎడమల బ్యాటింగ్ కలయిక బాగుంటుంది. మిడిల్ ఆర్డర్‌లో ఆడేవారు ఓపెనింగ్ చేయాలంటే కష్టమే. కానీ.. ఓపెనింగ్ బ్యాటర్ మిడిల్ ఆర్డర్‌లో ఆడటం కష్టమేం కాదు. ముఖ్యంగా రోహిత్‌కు. ఆరంభంలో అతడు ఆ స్థానంలోనే ఆడేవాడు'' అని గాంధీ విశ్లేషించాడు. బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో భాగంగా రెండో టెస్టు ఆడిలైడ్ వేదికగా డిసెంబర్ 6 నుంచి ప్రారంభం కానుంది. తొలి టెస్టులో ఘన విజయంతో టీమ్‌ఇండియా ఇప్పటికే 1-0 ఆధిక్యంలో ఉంది.

ఆనంద్ తర్వాత అర్జున్

న్యూఢిల్లీ: తెలుగు గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఇరిగేశి అరుదైన ఘనత సాధించాడు. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత అధికారికంగా 2800 ఎలో రేటింగ్ మైలు రాయిని చేరుకున్న రెండో భారతీయుడిగా అతడు నిలిచాడు. తాజా ఫిడే ర్యాంకింగ్స్‌లో అర్జున్ నాలుగో స్థానంలో ఉన్నాడు. 21 ఏళ్ల అర్జున్.. ఇటీవల చెస్ ఒలింపియాడ్‌లో టీమ్ టైటిల్‌తో పాటు వ్యక్తిగత స్వర్ణాన్ని గెలుచుకున్నాడు. ''చెస్ చరిత్రలో 2800 ఎలో రేటింగ్‌ను అందుకున్న 16వ ఆటగాడిగా అర్జున్ ఇరిగేశి నిలిచాడు'' అని ఫిడే ఎక్స్‌లో పేర్కొంది. అర్జున్ ప్రస్తుతం 2801 రేటింగ్‌తో ఉన్నాడు. అతడు ఇంతకుముందు లైవ్ రేటింగ్స్‌లో 2800 మార్కును అందుకున్నాడు. వరంగల్‌కు చెందిన అర్జున్.. 14 ఏళ్ల 11 నెలల 13 రోజుల వయసులో గ్రాండ్‌మాస్టర్ టైటిల్ సాధించాడు. 2024లో భారత టాప్ రేటెడ్ ఆటగాడయ్యాడు. 2831 పాయింట్లతో మాగ్నస్ కార్ల్‌సన్ నంబర్‌వన్ ఆటగాడిగా కొనసాగుతున్నాడు. కరువానా (2805) రెండో స్థానంలో ఉన్నాడు. నకమురా (2802)ది మూడో స్థానం. ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో డింగ్ లిరెన్‌తో తలపడుతోన్న గుకేశ్.. 2783 పాయింట్లతో అయిదో స్థానంలో ఉన్నాడు.

సింధు ఎట్టకేలకు

లక్నో: సయ్యద్ మోదీ అంతర్జాతీయ సూపర్ 300 టోర్నీలో భారత స్టార్ షట్లర్లు పి.వి.సింధు, లక్ష్యసేన్ విజేతలుగా నిలిచారు. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ సింధు 2114, 2116తో ప్రపంచ 119వ ర్యాంకర్ వు లుయో యు (చైనా) పై విజయం సాధించింది. వరుస గేమ్‌ల్లో ప్రత్యర్థిని చిత్తుచేసిన సింధు.. రెండేళ్ల తర్వాత అంతర్జాతీయ టోర్నీ టైటిల్ నెగ్గింది. సింధు చివరిగా 2022 జులైలో సింగపూర్ ఓపెన్‌లో విజేతగా నిలిచింది. సయ్యద్ మోదీ టోర్నీలో సింధు ఛాంపియన్‌గా నిలవడం ఇది మూడో సారి. 2017, 2022లలో ఆమె టైటిళ్లు సాధించింది. పురుషుల సింగిల్స్ ఫైనల్లో టాప్ సీడ్ లక్ష్యసేన్ 216, 217తో జియా హెంగ్ జేసన్ (సింగపూర్)ను మట్టికరిపించాడు. కేవలం 31 ని మిషాల్లోనే పని పూర్తిచేసిన లక్ష్యసేన్.. ప్రత్యర్థిపై తన విజయాల రికార్డును 30తో మరింత మెరుగుపరుచుకున్నాడు. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్ ట్రీసా జాలీ జోడీ ఛాంపియన్‌గా నిలిచింది. ఫైనల్లో ఈ జంట 2118, 2111తో లీ జిగ్ లీ కియాన్ (చైనా) జోడీపై విజయం సాధించింది. తొలి గేమ్‌లో కాస్త ప్రతిఘటన ఎదుర్కొన్న భారత జోడీ.. రెండో గేమ్‌ను ఏకపక్షంగా ముగించి మొదటి సారిగా సయ్యద్ మోదీ టైటిల్‌ను సొంతం చేసుకుంది. పురుషుల డబుల్స్‌లో పృథ్వీ రాయ్ సాయి ప్రతీక్ జోడీ రన్నరప్‌గా నిలిచింది. ఫైనల్లో ఈ ద్వయం 1421, 2119, 1721తో హువాంగ్ యాంగ్ (చైనా) చేతిలో పరాజయం చవిచూసింది. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో ధ్రువ్ కపిల తనీషా క్రాస్టో జోడీ 2118, 1421, 821తో దెచపోల్ సుపిసర (థాయ్‌లాండ్) జంట చేతిలో పోరాడి ఓడి రన్నరప్‌గా నిలిచింది.

2028 ఒలింపిక్స్ ఆడతా

2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో తప్పక ఆడతానని భారత స్టార్ షట్లర్ పి.వి.సింధు తెలిపింది. ''సయ్యద్ మోదీ టోర్నీ విజయం నాకు కచ్చితంగా చాలా ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. నా వయసు 29 ఏళ్లు కావడం ఎన్నో రకాలుగా కలిసొచ్చే అంశం. నాకెంతో అనుభవం ఉంది. బ్యాడ్మింటన్‌లో తెలివి, అనుభవం చాలా ముఖ్యం. రాబోయే కొన్నేళ్లు ఆటలో కొనసాగుతా. గాయాలు లేకుండా ఉండటమే నా ప్రధాన లక్ష్యం. లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్ చాలా దూరంలో ఉన్నాయి. ఒలింపిక్స్‌లో కచ్చితంగా ఆడతా. కానీ గాయాలకు దూరంగా ఉంటూ.. ఆటను ఆస్వాదించడం అత్యంత కీలకం. ఫిట్‌గా ఉంటే ఒలింపిక్స్ ఎందుకు ఆడను'' అని సింధు పేర్కొంది.

అమన్ సెంచరీ..
జపాన్‌పై దంచికొట్టిన యువ భారత్

షార్జా: అండర్19 ఆసియా కప్ (U19 Asia Cup)లో భాగంగా గ్రూప్ ఎలో భారత్, జపాన్ జట్లు తలపడుతున్నాయి. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన యువ భారత్ జట్టు దంచికొట్టింది. నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 339 పరుగుల భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ మహ్మద్ అమన్ (122*; 118 బంతుల్లో 7 ఫోర్లు) శతకం బాదాడు. ఓపెనర్ ఆయుష్ మాత్రే (54; 29 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపులు మెరిపించాడు. 13 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ (23; 23 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడినా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. సిద్ధార్థ్ (35) ఫర్వాలేదనిపించగా.. మిడిల్ ఆర్డర్‌లో వచ్చిన కార్తికేయ (57; 50 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అర్ధశతకంతో మెరిశాడు. చివర్లో హార్దిక్ రాజ్ (25*; 12 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. ఓపెనర్లు ఆయుష్, వైభవ్ తొలి వికెట్‌కు 65 పరుగులు జోడించగా.. అమన్, కార్తికేయ జోడీ నాలుగో వికెట్‌కు 122 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. జపాన్ బౌలర్లలో హ్యూగో కెల్లీ 2, కీఫెర్ యమమోటో 2, కజుమా కటోస్టాఫోర్డ్, ఆరవ్ తివారీ చెరో వికెట్ పడగొట్టారు. ఈ టోర్నీలో పాకిస్థాన్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 43 పరుగుల తేడాతో ఓటమిపాలైన సంగతి తెలిసిందే.

భలే ప్రాక్టీస్

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియా పీఎం ఎలెవన్‌తో ప్రాక్టీస్ మ్యాచ్‌లో తొలి రోజు ఆట వర్షార్పణం అయినా.. రెండో రోజును టీమ్‌ఇండియా బాగానే ఉపయోగించుకుంది. ఈ రెండు రోజుల మ్యాచ్‌లో ఆదివారం వర్షం తెరపినివ్వడంతో ఇరు జట్లు 46 ఓవర్ల మ్యాచ్ ఆడాయి. ఇందులో భారత్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. గులాబీ బంతితో ఆడిన ఈ మ్యాచ్‌తో బౌలర్లు, బ్యాటర్లు ఇద్దరికీ బాగానే ప్రయోజనం చేకూరింది. టాస్ గెలిచి బౌలింగ్ చేసిన భారత్.. ప్రత్యర్థి జట్టును 43.2 ఓవర్లలో 240 పరుగులకే ఆలౌట్ చేసింది. బుమ్రా దూరంగా ఉన్న ఈ మ్యాచ్‌లో పేస్ దళాన్ని హర్షిత్ రాణా (4/44) ముందుండి నడిపించాడు. ఆకాశ్ దీప్ (2/58), మహ్మద్ సిరాజ్ (1/18) సెత్తం ఆకట్టుకున్నారు. ప్రసిద్ధ్, వాషింగ్టన్ సుందర్, జడేజా తలో వికెట్ తీశారు. తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి 3 ఓవర్లు వేసి 10 పరుగులిచ్చాడు. వికెట్లేమీ తీయలేదు. పీఎం ఎలెవన్ జట్టులో ఓపెనర్ సామ్ కొన్‌స్టాస్ (107; 97 బంతుల్లో 14×4, 1×6) సెంచరీతో మెరిశాడు. హనో జాకబ్స్ (61), జాక్ క్లేటాన్ (40) కూడా ఆకట్టుకున్నారు. లక్ష్యాన్ని భారత్ 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. వేలి గాయంతో తొలి టెస్టుకు దూరమైన శుభ్‌మన్.. ఫిట్‌నెస్‌ను, ఫామ్‌ను చాటుకున్నాడు. శుభ్‌మన్ గిల్ (50 రిటైర్డ్ నాటౌట్; 62 బంతుల్లో 7×4) భారత ఇన్నింగ్స్‌లో టాప్‌స్కోరర్‌గా నిలవడం విశేషం. ఓపెనర్ యశస్వి జైస్వాల్ (45; 59 బంతుల్లో 9×4), నితీశ్ (42; 32 బంతుల్లో 5×4, 1×6), వాషింగ్టన్ సుందర్ (42; 36 బంతుల్లో 5×4) కూడా రాణించారు. కెప్టెన్ రోహిత్ (3) ఒక్కడే విఫలమయ్యాడు. కేఎల్ రాహుల్ (27 రిటైర్డ్ నాటౌట్), జడేజా (27)లకు కూడా బాగానే బ్యాటింగ్ ప్రాక్టీస్ దక్కింది. కోహ్లీ మ్యాచ్‌కు దూరంగా ఉన్నాడు. భారత్ 42.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదన పూర్తి చేసింది. తర్వాత అదనంగా 3.1 ఓవర్లు ఆడిన భారత్ ఓ వికెట్ కోల్పోయి 16 పరుగులు చేసింది.

ఆస్ట్రేలియా పీఎం ఎలెవన్: 43.2 ఓవర్లలో 240 (కొన్‌స్టాస్ 107, క్లేటాన్ 40, హనో జాకబ్స్ 61; హర్షిత్ రాణా 4/44, ఆకాశ్ దీప్ 2/58, సిరాజ్ 1/18, జడేజా 1/32, ప్రసిద్ధ్ 1/37, సుందర్ 1/38) **భారత్:** 46 ఓవర్లలో 257/5 (యశస్వి 45, రాహుల్ రిటైర్డ్ నాటౌట్ 27, శుభ్‌మన్ రిటైర్డ్ నాటౌట్ 50, రోహిత్ 3, నితీశ్ 42, సుందర్ నాటౌట్ 42; జడేజా 27, సర్ఫరాజ్ 1, పడిక్కల్ 4 నాటౌట్; చార్లీ అండర్సన్ 2/30, లాయిడ్ పోప్ 1/47, రెన్‌షా

దబంగ్ దిల్లీ జోరు

నోయిడా: నవీన్ కుమార్ అదిరే ప్రదర్శనతో ప్రొ కబడ్డీ లీగ్‌లో ఆదివారం దబంగ్ దిల్లీ 3221తో తమిళ్ తలైవాస్‌పై విజయం సాధించింది. నవీన్ 11 రైడ్ పాయింట్లతో సత్తా చాటాడు. విరామానికి 1212తో సమంగా నిలిచిన దిల్లీ.. ద్వితీయార్ధంలో ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. దిల్లీ తరఫున నవీన్‌తో పాటు అషు మాలిక్ (5) రాణించాడు. తలైవాస్ జట్టులో మొయిన్ (8) మెరుగైన ప్రదర్శన చేశాడు. దిల్లీ 48 పాయింట్లతో పట్టికలో రెండో స్థానానికి చేరుకుంది. మరో మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 3835తో బెంగాల్ వారియర్స్‌పై నెగ్గింది. దేవాంక్ (13) పట్నా విజయంలో కీలక పాత్ర పోషించాడు.

రూ.23 కోట్ల ఆటగాడు కాదు..
ఆ జట్టుకు రూ.1.5 కోట్ల ప్లేయరే కెప్టెన్..?



కోల్‌కతా: ఈ సారి ఐపీఎల్‌లో కెప్టెన్ల కొరత సమస్యను చాలా జట్లు ఎదుర్కొంటున్నాయి. అందులో ఒకటి కోల్‌కతా నైట్‌రైడర్స్. గత ఐపీఎల్ సీజన్ 2024లో జట్టును విజేతగా నిలబెట్టినప్పటికీ.. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌నే వదులుకుంది కోల్‌కతా. దీంతో ఇప్పుడు కొత్త కెప్టెన్ కోసం అన్వేషణ ప్రారంభించింది. వేలంలో భారీ మొత్తానికి తిరిగి సొంతం చేసుకున్న వెంకటేశ్ అయ్యర్‌కే కెప్టెన్సీ పగ్గాలు అప్పగిస్తారని తొలుత వార్తలు వచ్చాయి. అయితే.. సీనియర్ అయిన అజింక్య రహానె కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించేందుకు రంగం సిద్ధమైనట్లు తాజా సమాచారం. ఇటీవల జరిగిన మెగా వేలం 2025లో కోల్‌కతా.. వెంకటేశ్ అయ్యర్‌ను రూ.23.75 కోట్లు వెచ్చించి దక్కించుకుంది. అదే సమయంలో రహానెను రూ.1.5 కోట్ల బేస్ ప్రైజ్‌కే సొంతం చేసుకుంది. భారీ మొత్తానికి దక్కించుకున్న అయ్యర్ కంటే.. ఎంతో అనుభవమున్న రహానెకు వచ్చే సీజన్ జట్టు బాధ్యతలను అప్పగించాలని ఫ్రాంచైజీ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కెప్టెన్సీ విషయంలో రహానె ఇప్పటికే నిరూపించుకున్నాడు. టీమ్‌ఇండియాను గతంలో పలుసార్లు ముందుండి నడిపించాడు. ప్రస్తుతం రంజీ ట్రోఫీలో ముంబయి జట్టు కెప్టెన్. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుని కోల్‌కతా కెప్టెన్సీ విషయంలో ఓ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ''నిజమే.. ప్రస్తుతానికి రహానెకు కోల్‌కతా కొత్త కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించాలని ఫ్రాంచైజీ 90 శాతం ధ్రువీకరణకు వచ్చింది. సారథ్య బాధ్యతల కోసమే అతడిని వేలంలో తీసుకుంది'' అంటూ ఆ జట్టు వర్గాలు వెల్లడించినట్లు ఓ మీడియా కథనంలో పేర్కొంది. అంతకుముందు కెప్టెన్సీ రేసులో తానూ ఉన్నట్లు వెంకటేశ్ అయ్యర్ చెప్పిన విషయం తెలిసిందే. ''జట్టు కోసం పత్రి ఒక్కరూ ఆడేలా వాతావరణాన్ని సృష్టించడం కెప్టెన్ బాధ్యత. ఆ బాధ్యతలు అప్పగిస్తే.. స్వీకరించడనాకి ఎంతో సంతోషంగా ఉన్నాను'' అంటూ చెప్పాడు. నితీశ్ రాణా లేనప్పుడు గతంలో జట్టును పలుసార్లు ముందుండి నడిచిపించినట్లు తెలిపాడు. అయితే.. వచ్చే సీజన్‌కు రహానెకు పూర్తిస్థాయి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించి, వెంకటేశ్‌కు వైస్ కెప్టెన్సీని ఇవ్వాలని కేకేఆర్ యాజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం. మరి ఆ జట్టు ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించనుందే చూడాలి.

30 దాటిందా? ఈ ఆరోగ్యసూత్రాలు పాటించండి

30 ఏళ్ల వయసు పడిన తర్వాత అధిక శాతం మంది పురుషులకు బాధ్యతలు పెరుగుతాయి. ఉద్యోగం, కుటుంబం, పిల్లలు ఇలా పూర్తిగా బిజీ అయిపోతారు. తీరిక లేకుండా కాలం గడిచిపోతూ ఉంటుంది. ఈ క్రమంలో ఆ వయసు తర్వాత చాలా మంది తమ శరీరం గురించి పెద్దగా పట్టించుకోరు. పెద్దగా జాగ్రత్తలు తీసుకోరు. అయితే, 30 ఏళ్ల వయసు తర్వాత పురుషుల తప్పకుండా కొన్ని విషయాలపై దృష్టి పెట్టాలి. అలా అయితేనే ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తే రిస్క్ తగ్గుతుంది. అలా 30 ఏళ్ల తర్వాత పురుషులు తీసుకోవాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలు ఏవో ఇక్కడ తెలుసుకోండి.

గుండెపై ప్రత్యేక శ్రద్ధ

30 ఏళ్ల వయసు దాటిన తర్వాత పురుషులు గుండె ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఎందుకంటే ఆ తర్వాతే గుండె వ్యాధుల రిస్క్ పెరుగుతుంది. బ్లడ్ ప్రెజర్, కొలెస్ట్రాల్ పెరగడం లాంటి సమస్యలు గుండెను దెబ్బతీస్తాయి. అందుకే ముందుగా అవి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పోషకాలు ఉండే ఆహారంతో పాటు వ్యాయామాలు చేయాలి. తరచూ బీపీ, కొలెస్ట్రాల్ చెక్ చేసుకుంటూ ఉండాలి. ఏదైనా సమస్య ఉంటే వెంటనే స్పందించి.. దాన్ని పరిష్కరించుకునే దిశగా కృషి చేయాలి. ఆరోగ్యం విషయంలో అసలు నిర్లక్ష్యం చేయకూడదు.

మానసిక ఆరోగ్యం

బాధ్యతలు పెరగడంతో 30 ఏళ్ల తర్వాత చాలా మంది పురుషులు ఒత్తిడికి గురవుతుంటారు. కొందరికి ఆందోళన ఉంటుంది. అయితే, ఈ వయసు తర్వాత మానసిక ఆరోగ్యం చాలా ముఖ్యం. అన్ని విధాల ఆరోగ్యంగా ఉండేందుకు ఇది కీలకం. అందుకే ధ్యానం, యోగా, బ్రీత్ ఎక్సర్‌సైజ్‌ల్లాంటివి ప్రతీ రోజు చేయాలి. ఒత్తిడి లేకుండా జీవనం సాగించేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

రెగ్యులర్‌గా ఆరోగ్య పరీక్షలు

30 ఏళ్లు దాటిన పురుషులు రెగ్యులర్‌గా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకునేందుకు ఇవి ఉపయోగపడతాయి. బ్లడ్ ప్రెజర్, కొలెస్ట్రాల్ లెవెల్స్, గుండె ఇలా అవసరమైన హెల్త్ చెకప్స్ చేయించుకోవాలి.

పొట్ట రాకుండా..

చాలా మంది పురుషుల్లో 30 ఏళ్ల తర్వాత వచ్చే సమస్య ఊబకాయం. ఇది చాలా సమస్యలకు దారి తీస్తుంది. బరువు పెరిగి ఊబకాయం వస్తే డయాబెటిస్ రిస్క్ పెరుగుతుంది. కొలెస్ట్రాల్ అధికమై గుండెకు ముప్పు ఏర్పడుతుంది. అందుకే పొట్ట పెరగకుండా తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎంత బిజీగా ఉన్నా ఉదయాన్నే వ్యాయామం చేయాలి. ఓ సరైన డైట్ పాటించాలి. ప్రోటీన్, ఫైబర్ ఉండే ఆహారాలు తినాలి. కాయధాన్యాలు, నట్స్, విత్తనాలు, కూరగాయలు, పండ్లు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. మొత్తంగా బరువు పెరిగి పొట్టరాకుండా 30 ఏళ్లు దాటిన పురుషులు దృష్టి సారించాలి.

ఎముకలు, కండరాల దృఢత్వంపై..

వయసు పెరిగే కొద్ది ఎముకల దృఢత్వం, కండలు తగ్గిపోతూ ఉంటాయి. ముఖ్యంగా 30 ఏళ్ల వయసు తర్వాత చాలా మంది బిజీగా ఉండి ఎక్సర్‌సైజ్‌లు మానేయడం, శారీరక శ్రమ తగ్గించేయటంతో ఇలా జరుగుతూ ఉంటుంది. మరికొందరు పోషకాలు సరిగా తీసుకోక పోవడం కూడా కారణంగా ఉంటుంది. 30 ఏళ్లు దాటిన తర్వాత కండలు బాగా ఉండాలంటే వెయిట్ లిఫ్టింగ్, రెసిస్టెంట్ వ్యాయామాలతో పాటు వివిధ రకాల ఎక్సర్‌సైజ్‌లు చేయాలి. ప్రతీ రోజు సాధారణ వ్యాయమాలు చేసినా.. వారంలో కనీసం మూడు రోజులైన ఈ ఎక్సర్‌సైజ్‌లు చేయాలి. వీటి వల్ల ఎముకల దృఢత్వం కూడా మెరుగ్గా ఉంటుంది. ప్రొటీన్లు, విటమిన్ డీ, కాల్షియం, ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారాలు తీసుకోవాలి.

ఎగ్ 65 .. ఇలా తయారుచేసుకోండి.. !

సామాన్యులకు తక్కువ ధరకే లభించే పోషకాహారం గుడ్డు. దీనిలో ప్రొటీన్ శాతం ఎక్కువ. అయితే కోడిగుడ్డును ఉడికించుకొని.. ఆమ్లెట్ చేసుకొని, కర్రీ చేసుకొని మాత్రమే కాకుండా వివిధ రకాలుగా వంట చేసుకోవచ్చు. ఇందులో ఎగ్ 65 కూడా ఒకటి. దక్షిణ భారత ఆహార ప్రియులకు ఇష్టమైన ఫుడ్ లో ఎగ్ 65 కూడా ఒకటి. తమిళనాడులో మొదట ఈ ఎగ్ 65 తయారీ ప్రారంభమైనప్పటికీ క్రమంగా మిగతా ప్రాంతాల్లో కూడా స్ట్రీట్ ఫుడ్ లలో ఎక్కువగా వినియోగించే ఆహారంగా మారిపోయింది. మన తెలుగు ప్రజలు అయితే ఎగ్ 65 అంటే లొట్టలేసుకొని తింటారు. అయితే ఎంతో రుచికరమైన ఎగ్ 65ని మీ ఇంట్లోనే చాలా ఈజీగా తయారుచేసుకోవచ్చు. దీన్ని తయారు చేయడం ఎలాగో ఇప్పుడు చూద్దాం.

ఎగ్ 65 తయారీకి కావాల్సినవి

గుడ్లు మీ అవసరానికి తగినన్ని
మైదా పిండి 2 టేబుల్ స్పూన్లు
మొక్కజొన్న పిండి 4 టేబుల్ స్పూన్లు
కారం పొడి 4 టేబుల్ స్పూన్లు
గరం మసాలా 1/2 టేబుల్ స్పూన్
జీలకర్ర పొడి 1 టేబుల్ స్పూన్
అల్లం వెల్లుల్లి పేస్ట్ 1 టేబుల్ స్పూన్
నూనె కావలసినంత
ఉప్పు తగినంత

ఎగ్ 65 తయారీ విధానం

ముందుగా గుడ్లను నీటిలో సరిగ్గా ఉడకబెట్టాలి. తర్వాత గుడ్డు పెంకును తొలగించండి. తర్వాత ఒక గిన్నెలో మైదా పిండి, మొక్కజొన్న పిండి, కారం పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా, అల్లం వెల్లుల్లి పేస్ట్, ఉప్పు వేయాలి. తర్వాత అందులో నీరు కలపండి. క్రమంగా దాని పరిమాణాన్ని పెంచండి.. తద్వారా మీరు పేస్ట్ చేయడానికి బాగా కలపవచ్చు. ఇప్పుడు ఉడికించిన గుడ్డును చిన్న ముక్కలుగా తరిగి పిండిలో కలపండి. ఇప్పుడు పిండిని వేసి బాగా కదిలించండి.. తద్వారా మసాలాలు ప్రతి వైపు సమానంగా ఉంటాయి. ఇప్పుడు పేస్ట్ పూతతో గుడ్లు సిద్ధం చేసిన తర్వాత స్టవ్ మీద పాన్ పెట్టి నూనె పోయాలి. మీడియం మంట మీద మూడు నిమిషాలు వేయించాలి. గుడ్డు 65 బాగా వేగిన తర్వాత నూనెలోంచి తీసి ప్లేట్‌లోకి మార్చుకుని గ్రీన్ చట్నీతో తింటే ఆ రుచికి ఆహా అనాల్సిందే.



ఈ లక్షణాలు మీలో ఉన్నాయా?

అయితే డిప్రెషన్ కు గురైనట్టే..!

ప్రపంచవ్యాప్తంగా వివాహ వ్యవస్థ గురించి ఎన్నో రకాల అధ్యయనాలు జరుగుతున్నాయి. మకావు పాలిటెక్నిక్ యూనివర్శిటీలో దాదాపు 100,000 మందిపై ఇటీవల జరిపిన ఒక అధ్యయనంలో ఒక షాకింగ్ విషయం తెలిసింది. పెళ్లి చేసుకోకుండా ఒంటరిగా జీవించేవారికి డిప్రెషన్ వచ్చే అవకాశం 80 శాతం ఎక్కువగా ఉందని వెల్లడైంది. ఈ అధ్యయనంలో అమెరికా, బ్రిటన్, ఐర్లాండ్, మెక్సికో, దక్షిణ కొరియా, చైనా, ఇండోనేషియా దేశాలకు చెందిన వారు పాల్గొన్నారు. 18 ఏళ్లు పైబడిన అవివాహితులను ఈ అధ్యయనంలో భాగం చేశారు. అధ్యయనంలో భాగంగా పెళ్లి చేసుకోకుండా ఒంటరిగా జీవించే వారిలో 80 శాతం మంది ఒత్తిడి లేదా డిప్రెషన్తో బాధపడుతున్నారని తెలిసింది. అదే పెళ్లయిన వారిలో డిప్రెషన్ బారిన పడేవారి శాతం 40గా ఉన్నట్టు అధ్యయనం వెల్లడించింది. విడాకులు తీసుకున్న వారిలో లేదా జీవిత భాగస్వామి నుంచి విడిపోయిన వారిలో కూడా అనేక రకాల మానసిక సమస్యలు కనిపించాయి. ఈ అధ్యయనంలో పాల్గొన్న నిపుణులు చాలా మంది వివాహితులకు మద్దతిచ్చే వారు అధికంగా ఉంటారని చెబుతున్నారు. అంతే కాదు వారు ఆర్థికంగా కూడా బలంగా ఉంటారు. అందుకే వారికి మానసిక సమస్యలు తక్కువగా వచ్చే అవకాశం ఉంది. ఉన్నత విద్యావంతులైన అవివాహిత పురుషులు కూడా మానసిక అభద్రతతో బాధపడుతున్నారని అధ్యయనం వెల్లడించింది. ఈ అధ్యయనంలో పాల్గొన్న మనస్తత్వవేత్త డాక్టర్ బెల్లా డి పాలో మాట్లాడుతూ వివాహం ఒక పురుషుడు, స్త్రీకి స్థిరత్వాన్ని ఇస్తుందని చెప్పారు. అయితే ఈ అధ్యయనంలో పెళ్లికాని వారి కంటే వివాహిత దంపతుల ఆరోగ్యం మెరుగ్గా ఉందని కనుగొన్నారు.

డిప్రెషన్ లక్షణాలు

డిప్రెషన్ వస్తే కొన్ని రకాల లక్షణాలు కనిపిస్తాయి. ఎక్కువ నిద్రపోతూ ఉంటారు లేదా పూర్తిగా నిద్రని తగ్గించేస్తారు. నిద్రమాత్రలు వేసుకుంటేనే వీరికి నిద్ర వస్తుంది. వారు అన్ని విషయాలపై ఆసక్తిని కోల్పోతారు. విచారంగా కూర్చుంటారు. ఖాళీగా ఉండి ఏ పనీ చేయడానికి ఇష్టపడరు. విపరీతంగా బరువు పెరుగుతారు లేదా తగ్గిపోతారు. ఉదయం నుంచి రాత్రి వరకు శక్తి లేనట్టు నీరసంగా ప్రవర్తిస్తారు. డిప్రెషన్ సమస్యను చాలా తేలికగా తీసుకుంటారు కానీ ఇది ఒక్కోసారి తీవ్రంగా మారుతుంది. అది మీ దైనందిన జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. దీన్ని తీవ్రమైన మూడ్ డిజార్డర్ గా కూడా చెప్పుకుంటారు. వీరికి ఆహారం, నిద్ర, ఆట పాటలపై ఎలాంటి ఆసక్తి ఉండదు. మనదేశంలో 14 శాతం మంది ప్రజలు డిప్రెషన్ తో బాధపడుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో 10 శాతం మందికి వెంటనే వైద్య సాయం అవసరం. మన జనాభాలో 20 శాతం ఏదో ఒక సందర్భంలో డిప్రెషన్ బారిన పడి తేరుకున్నవారేనని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. మనదేశంలో పది మంది డిప్రెషన్ బారిన పడితే వారిలో ఒకరికి మాత్రమే వైద్య సాయం అందుతోంది. దీన్ని బట్టి భారత్ మానసకి సమస్యలపై అవగాహన ఎంత అవసరమో అర్థమవుతోంది.

తెరపైకి మోహన్‌బాబు మనవరాళ్లు..

'కన్నప్ప'లో లుక్ రిలీజ్

మంచు కుటుంబం నుంచి మరో తరం తెరపై అలరించేందుకు సిద్ధమైన సంగతి తెలిసిందే. ఇప్పటికే 'కన్నప్ప'లో విష్ణు కుమారుడు అవ్రామ్ లుక్ రిలీజ్ చేయగా మంచి ఆదరణ లభించింది. తాజాగా విష్ణు కుమార్తెలు అరియానా, వివియానా ఈ చిత్రంలో కనిపించనున్నట్లు మోహన్‌బాబు తెలిపారు. వీరి పుట్టినరోజు సందర్భంగా 'కన్నప్ప'లో వీరికి సంబంధించిన ఫొటోను పంచుకున్నారు. ''కన్నప్ప'తో నా మనవరాళ్లు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెడుతున్నందుకు ఆనందిస్తున్నాను. నటనపై వాళ్లకు ఉన్న అభిరుచి చూసి నాకెంతో గర్వంగా ఉంది. పరిశ్రమలో వారికి గుర్తింపురావాలని ఎంతోమందిలో స్ఫూర్తి నింపాలని కోరుకుంటున్నా' అని పోస్ట్ పెట్టారు. ఇక ఈ చిత్రంలో మంచు విష్ణు కుమారుడు అవ్రామ్ తిన్నడుగా నటించనున్నాడు. మంచువిష్ణు చిన్నప్పటి పాత్రను ఇందులో అవ్రామ్ పోషించనున్నాడు. ''కన్నప్ప'లో నా కుమార్తెలు నటిస్తున్నందుకు ఎంతో గర్వంగా ఉంది. నా చిన్నమమ్మీలు (అరియానా, వివియానా) తెరపై సృష్టించిన అద్భుతాన్ని ప్రపంచం ఎప్పుడు చూస్తుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నా' అంటూ మంచు విష్ణు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో 'జిన్నా' సినిమాలో వీరిద్దరూ పాట పాడి అలరించారు. ఆ సినిమాలోని 'ఫ్రెండ్‌షిప్..' పాటను వీరిద్దరూ కలిసి ఆలపించారు. 'జిన్నా' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లోనూ లైవ్‌లో పాట పాడారు.

'ఈటీవీ విన్' ఒరిజినల్ మూవీ.. కానిస్టేబుల్‌గా వర్ష

ప్రముఖ తెలుగు ఓటీటీ సంస్థ 'ఈటీవీ విన్' ప్రేక్షకులకు వినోదం పంచేందుకు మరో సినిమాని తీసుకురానుంది. అదే 'కానిస్టేబుల్ కనకం'. వర్ష బొల్లమ్మ ప్రధాన పాత్రలో దర్శకుడు ప్రశాంత్ కుమార్ దిమ్మల రూపొందిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ సోమవారం ప్రారంభమైంది. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా తెలియజేస్తూ టీమ్.. వర్ష ఫస్ట్‌లుక్ విడుదల చేసింది. ఈ చిత్రం నేరుగా ఆ ఓటీటీలోనే విడుదలవుతుంది.

పెళ్లి కూతురుగా శోభిత ముస్తాబు..

ఫొటోలు వైరల్

నటి శోభితా ధూళిపాళ్ల త్వరలో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టనున్నారు. మరో రెండు రోజుల్లో ఆమె బ్యాచిలర్ జీవితానికి గుడ్ బై చెప్పనున్నారు. నటుడు నాగ చైతన్యతో బుధవారం ఆమె వివాహం జరగనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే పెళ్లి వేడుకలు ఇరు కుటుంబాల్లో ప్రారంభమయ్యాయి. కాబోయే వధూవరులకు ఇటీవల మంగళ స్నానాలు చేయించారు. ఈనేపథ్యంలోనే ఆమెను సోమవారం పెళ్లికుమార్తెగా ముస్తాబు చేశారు. మంగళ హారతులు ఇచ్చారు. దీనికి సంబంధించిన ఫొటోలను శోభిత తాజాగా నెటిజన్లతో పంచుకున్నారు. ఇందులో ఆమె సంప్రదాయ చీర కట్టులో మెరిసిపోతూ సిగ్గు లొలికించారు.దాదాపు రెండేళ్ల క్రితం నాగచైతన్య శోభిత మధ్య పరిచయం మొదలైంది. శోభిత మంచి మనసు తనని కట్టిపడేసిందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చైతన్య చెప్పారు. '''ముంబయిలో జరిగిన ఓ ఓటీటీ ఈవెంట్లో ఇద్దరం తొలిసారి కలుసుకున్నాం. మాటల్లోనే తన మంచి మనసు నన్ను కట్టిపడేసింది. మా ఇద్దరికీ ఎన్నో ఉమ్మడి పోలికలు ఉన్నాయి. ఒకరినొకరం బాగా అర్థం చేసుకున్నాం. తనో ఫ్యామిలీ గర్ల్. కుటుంబానికి ఎంతో ప్రాధాన్యమిస్తుంటుంది. అందుకే ఆమెతో కలిసి జీవితం పంచుకోవడానికి ఆత్రుతగా ఎదురుచూస్తున్నా'' అని అన్నారు. ''తను చాలా కూల్‌గా, కామ్‌గా ఉంటాడు. ఆడంబరాల్ని ప్రదర్శించడు. అందరితో హుందాగా వ్యవహరిస్తుంటాడు. ఎదుటివారికి ఎంతో గౌరవం ఇస్తాడు. ఆ లక్షణాలే నాకు బాగా నచ్చాయి'' అని శోభిత ఓ సందర్భంలో చైతూ గురించి చెప్పారు.

ఈ వారం థియేటర్‌లో ఒకే ఒక్కడు 'పుష్ప'రాజ్

అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'పుష్ప 2: ది రూల్'. రష్మిక కథానాయిక. ఫహద్ ఫాజిల్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ డిసెంబరు 5న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. తెలుగుతో పాటు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, బెంగాలీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటు ఇండియాతో పాటు, అటు ఓవర్సీస్‌లోనూ బుకింగ్స్‌తో దూసుకుపోతోంది. కూలీగా జీవితాన్ని మొదలు పెట్టిన పుష్పరాజ్ ఎర్ర చందనం సిండికేట్‌కు నాయకుడు ఎలా అయ్యాడో 'పుష్ప 1'లో చూపించారు. ఈ క్రమంలో శత్రువులను పెంచుకున్నాడు. మరి వారితో పోరాటం ఎలా సాగింది? పుష్ప.. నేషనల్ నుంచి ఇంటర్నేషల్ స్థాయికి ఎలా ఎదిగాడు. ఈ క్రమంలో అతడికి ఎదురైన సవాళ్లు ఏంటి? అన్నది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై అంచనాలను పెంచాయి. తాజాగా విడుదల చేసిన 'పీలింగ్స్' సాంగ్ సోషల్‌మీడియాను ఓ ఊపు ఊపేస్తోంది. దేశవ్యాప్తంగా పుష్ప మేనియా నడుస్తున్న నేపథ్యంలో తెలుగులో మరే చిత్రమూ ఈ వారం బాక్సాఫీస్ ముందుకు రావడం లేదు.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 882/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2523, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. Editor: Adula Thirupathi. Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. RNI NO: TELTEL/2023/87657